నేటి కందం- నేటికి అందం

పరిశోధనతో-మూలము
నరయుచు నొక విషయముపయి నవగాహనతోన్
పరిపూర్ణత్వము నొందగ
జరుపగ వలయును వల(ప్రసార దినంబున్

(సెప్టెంబర్ 30
వల(ప్రసార దినం ..)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ సోమవారం 30-9-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:51 పేజీలు:6 వెల: రూ.1/-


## తమిళనాడులో టాటా మోటార్స్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ.. 5000 మందికి కొత్త ఉద్యోగాలు..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : తమిళనాడులోని పనపక్కం జిల్లా పరిధిలో టాటా మోటార్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి సీఎం ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. రూ.9000 కోట్ల అంచనా వ్యయంతో టాటా మోటార్స్ తన న్యూ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీని నిర్మించనున్నది. దీనివల్ల యువతకు కొత్తగా 5,000 ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్ర రాజధాని చెన్నైకి 115 కి.మీ దూరంలో ఈ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఉంటుంది. సీఎం ఎంకే స్టాలిన్ తోపాటు రాష్ట్ర మంత్రులు దురాయి మురుగన్, టీఆర్బీ రాజా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎన్నికల సభలో ప్రసంగిస్తూ సొమ్మసిల్లిన ఖర్గే..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల ప్రచారంలో భాగంగా జమ్మూలో ప్రసంగిస్తూ వేదికపై స్పృహతప్పి పడిపోయారు. దీంతో కొన్ని నిమిషాల పాటు ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చింది. జస్రోటా అసెంబ్లీ నియోజకవర్గంలోని బర్నోటిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

వేదికపై ఉన్న సిబ్బంది వెంటనే అలర్ట్ అయి ఆయనను పడిపోకుండా పట్టుకుని సీట్లో కూర్చోబెట్టి త్రాగడానికి నీటిని అందించారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం, కూర్చోనే తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత మళ్లీ మధ్యలో ఆపేశారు. మళ్ళీ లేచి నిలబడి పార్టీ నేతలు ఆయనను పట్టుకుని నిలబడి ఉండగా 2 నిమిషాల పాటు ప్రసంగించారు.

ప్రసంగం అనంతరం వెళ్లే సమయంలో నాకు 83 ఏళ్లు, నేను అంత తొందరగా చనిపోను, మోడీని అధికారం నుంచి దించే వరకు చనిపోను అని అన్నారు.

ఆ తర్వాత ఖర్గేకు వైద్యులు చికిత్స అందించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ ఘటనపై ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎక్స్‌లో స్పందించారు.

జస్రోటాలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్నప్పుడు,

ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు ఆరోగ్య పరిస్థితిని చెక్ చేశారు. రక్తపోటు కొంచెం తక్కువగా ఉంది.

ప్రస్తుతం బాగానే ఉన్నారు. ఆయన సంకల్పం, ప్రజల ఆశీస్సులు ఆయన్ను బలంగా ఉంచుతాయన్నారు. ఇదిలా ఉంటే తన ప్రసంగంలో మల్లికార్జున్ ఖర్గే, బీజేపీపై విమర్శలు చేశారు.

## సిరియాపై అమెరికా వైమానిక దాడులు.. 37 మంది ఉగ్రవాదులు హతం..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : సిరియాలో అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. దాడుల్లో ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, అల్‌ఖైదాకు చెందిన 37 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. పలు ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. వాయువ్య సిరియాపై దాడి చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇందులో అల్‌ఖైదాతో అనుబంధం ఉన్న హుర్రాన్ అల్ దిన్ గ్రూప్ అగ్రనేతతో పాటు మరో ఎనిమిదిపై దాడి చేసినట్లు జరిగినట్లు తెలిపింది. టాప్ ఉగ్రవాది స్థానిక ఉగ్రవాద కార్యకలాపాలకు పర్యవేక్షిస్తుంటాడని చెప్పింది. అలాగే, సెంట్రల్ సిరియాలోని ఐసిస్ శిక్షణా శిబిరంపై సైతం సైనిక దాడి చేసినట్లు తెలిపింది. ఈ ఘటనలో 28 మంది హతమయ్యారని.. ఇందులో నలుగురు సిరియా నేతలు ఉన్నారని చెప్పింది.


అమెరికా ప్రయోజనాలతో పాటు మిత్రదేశాలు, భాగస్వాములకు వ్యతిరేకంగా కార్యకలాపాలను అడ్డుకునేందుకు వైమానిక దాడి నిర్వహించినట్లు చెప్పుకొచ్చింది. దాదాపు 900 మంది అమెరికా సైనికులను సిరియాలో అమెరికా మోహరించింది. యూఎస్ దళాలు ఈశాన్య సిరియాలోని కుర్దిష్ నేతృత్వంలోని సిరియన్ డెమొక్రటిక్ దళాలకు సలహాలు ఇవ్వడంతో పాటు సహాయం చేయనున్నాయి. ఇప్పటికే గాజా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు దిగుతున్నది. దీంతో పశ్చిమాసియాలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. హమాస్, ఇజ్బొల్లాను అంతమొందించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్నది.

# మహిళల కోసం మరిన్ని హాస్పిటల్స్ నిర్మిస్తాం-సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 : మహిళల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనా కల్పించేందుకు ఏర్పాటు చేసిన 'పింక్ పవర్ రన్-2024'కార్యక్రమానికి సీఎం రేవంత్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు

అనంతరం బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనా రన్‌లో గెలిచిన పలువురికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం, సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం కూడా అదే నమ్ముతున్నదని చెప్పారు.

ఉమెన్ హెల్త్ కేర్‌ను మెరుగుపరిచేందుకు కాంగ్రెస్





ప్రభుత్వం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైద్య రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. మహిళల ఆరోగ్యం కోసం మరిన్ని ఆసుపత్రులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం మనమంతా కలిసి కట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# ఆరు గ్యారెంటీలు గాలికొదిలేసి హైడ్రామాలు ఆడుతున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే మర్రి



హైదరాబాద్, సెప్టెంబర్ 29 :కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసి హైడ్రామాలు ఆడుతుందని మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిఆగ్రహం వ్యక్తం చేశారు. వినాయకనగర్ డివిజన్ బండ చెరువు సమీపంలోని, మౌలాలి పరిధిలోని శంకరయ్య కాలనీ, సింహాద్రినగర్, ఎన్ఎండిసి కాలనీ, శివానంద్‌నగర్ కాలని తదితర కాలనీప్రజలు హైడ్రా వల్ల భయాందోళనకు గురవుతున్నట్లు తెలుసుకుని ఆదివారం పలు కాలనీలను పర్యటించి ప్రజలకు భరోసాను కల్పించారు.

గత 30 సంవత్సరాల నుంచి ఇండ్ల పర్మిషన్లు , పన్నులు చెల్లించి ఇండ్లు నిర్మాణం చేపట్టుకున్నామని వివిధ కాలనీప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసి అనవసరమైన డ్రామాలు ఆడుతూ హైడ్రాతో ప్రజలను భయాభ్రాంతులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆరు గ్యారెంటీలు ఆట ఎక్కించి దృష్టి మలచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తొందని అన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలకోసం ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని, అలా కాకుండా వారిని ఆవేదనకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రజలు భయాందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతూ అనారోగ్యాల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని, ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని వారికి ఎమ్మెల్యే హామి ఇచ్చారు.

# త్వరలోనే ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం : మంత్రి పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి టీజీ ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్



స్టేడియంలో రీజియన్‌కు కేటాయించిన 35 సూపర్ లగ్జరీ ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సభలో మంత్రి మాట్లాడారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను లాభాల్లోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు.

అందులో భాగంగా డీజీల్ భారాన్ని తగ్గించుకోవడంతోపాటు కాలుష్య రహితం కోసం 2,500 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేయగా, వెయ్యి బస్సులు అందుబాటులోకి వచ్చాయన్నారు ప్రస్తుతం జంట నగరాల్లో 500బస్సులు నడుస్తున్నాయని, రానున్న రోజుల్లో డీజీల్ బస్సులను పూర్తిగా తొలగిస్తామన్నారు. భవిష్యత్ తరాలను కాలుష్యరహిత వాతవారణం అందించడానికి ఎలక్ట్రికల్ బస్సులను తీసుకువస్తున్నామని తెలిపారు.

దసరాలోగా ఉద్యోగులకు బాండ్ల రూపంలో ఉన్న బకాయిలు చెల్లిస్తామన్నారు. మహా లక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 92కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోగా, సంస్థకు రూ. 3,200కోట్ల ఆదాయం చేకూరిందన్నారు. గ్రామ సమాఖ్య సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయిస్తామని తెలిపారు.

# హైడ్రా కూల్చి వేతలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 : కొద్ది రోజులు హైదరాబాద్ నగరంలో హైడ్రా పేరుతో నిరుపేదల ఇండ్లను అమానవీయంగా కూల్చివేస్తున్న సంఘటనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన ఆరోపణల చేశారు. మూసీ పరీవాహకం లోకూల్చివేతలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా పేదల ఇండ్లను కూల్చి వేయడం సరికాదన్నారు. నగరంలో జలవిహార్, హైమ్యాక్స్ లాంటివి ఎన్నో అక్రమ కట్టడాలు చాలా ఉన్నాయి.

అలాంటి వాటిని వదిలిపెట్టి సామాన్యుల ఇండ్లను కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లకు రెడ్ మార్క్ పెట్టం తొందర పాటు చర్యగా అభివర్ణించారు. కూల్చిన ఇండ్లకు స్థానికంగానే బాధితులకు వసతి కల్పిస్తే మంచిదని సూచించారు. పేదలు నివసించే స్లమ్ జోలికి వెళ్లొద్దని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు.

# అభివృద్ధి, స్వేచ్ఛకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత - తెలుగు కమ్యూనిటీ మీట్ లో భట్టి





హైదరాబాద్, సెప్టెంబర్ 29 : అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గతంలో ఫ్యూడల్ మనస్తత్వంతో బందీ చేయబడిన రాష్ట్రాన్ని పూర్తి స్వేచ్ఛయుత రాష్ట్రంగా మార్చామని.. భవిష్యత్తులో ఈ విధానం కొనసాగుతుందని తెలిపారు. ఎవరు ఏ భావజాలానైనా వ్యక్తపరిచే వాతావరణాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పరిచామని వివరించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు అంతా తెలంగాణ రాష్ట్రం తో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఏమాత్రం అవకాశం ఉన్న ఉపయోగపడాలని.. తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టించాలని వారిని కోరారు.

హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్? ఇళ్ల నిర్మాణం పేరిట రాళ్లు కనుమరుగైపోయాయి. లేక్స్ కబ్జా చేసి ఇల్లు కట్టుకున్నారు. పార్కులు లేకుండా పోయాయి. లేక్స్ లేకపోతే వరదలు వచ్చినప్పుడు ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరిస్థితులు హైదరాబాదులోనూ ఏర్పడతాయి. నది గర్భంలో ఇల్ల నిర్మాణాలు చేస్తున్నారు.

వీటిని ఇప్పటికీ ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది. హైదరాబాద్ కి ప్రాణాంతకంగా మారుతుంది. పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారు. ధన, మానప్రాణాలు కాపాడడం ప్రభుత్వం బాధ్యత. ఆస్తులు కాపాడడం ప్రభుత్వం బాధ్యత. అందులో భాగంగా చెరువులను రక్షించేందుకు భవిష్యత్తు తరాలను అందించేందుకు తెలంగాణ రాష్ట్రంలో చర్యలు చేపట్టాం. వందల చెరువులు కనపడకుండా పోయాయి. కనీసం చెరువు గర్భంలో కట్టుకోకుండా అయినా ఆపాలి అనేది మా ప్రభుత్వం ఆలోచన అన్నారు.

మూసీ నదిలో మంచినీర ంపారించడం పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన. మూసి పునర్జీవం కార్యక్రమంలో భాగంగా నిర్వాసితులకు పూర్తి అవగాహన కల్పించి పునరావాస చర్యలు చేపడుతున్నాం. వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, వారి పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించడం, వారి ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు చేపట్టడం.. వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడడమే ప్రభుత్వ ఉద్దేశం. మూసీ నది పరివాహక ప్రాంతంలో కుటుంబాలు ఆరోగ్యంగా జీవించేందుకు ఆ నదిని తీర్చిదిద్దాలనేది ప్రభుత్వం ఆలోచన. కలుషితమైన మూసీ నదిలో జీవించడం ఎవరికి కూడా మంచిది కాదు అన్నారు. రాష్ట్రంలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వినియోగిస్తాం, రాష్ట్రంలో విద్య, వైద్యం, సేవా రంగాలను తీర్చిదిద్దుతామని, రాష్ట్రసమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతోపాటు, సింగరేణి సిఎండి బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పింక్ పవర్ రన్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర..

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన పింక్ పవర్ రన్ 2024ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఈ మారథాన్‌ను వైద్య ఆరోగ్యం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఒకేసారి 3కే, 5కే, 10కే రన్‌ను నిర్వహించారు. పింక్ మారథాన్‌లో గెలిచినవారికి సీఎం రేవంత్ రెడ్డి మెడల్స్ పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు ఐదు వేల మంది పాల్గొన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేందుకు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తున్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్య నానాటికి అధికమవుతున్నది. క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం, క్యాన్సర్‌ను మొదట్లోనే గుర్తించకపోవడం దీనికి కారణమని అని నిపుణులు పేర్కొంటున్నారు. ముందే గుర్తిస్తే సరైన చికిత్సతో మహమ్మారితో పోరాడవచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పింక్ పవర్ రన్ 2024ను నిర్వహిస్తున్నారు.

# మీ ఇండ్లపై బుల్డోజర్ దిగాలంటే.. ముందు బీజేపీ కార్యకర్తలను తాకాలి.. బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :హైడ్రా బుల్డోజర్లు ముందు మా మీద నుండి వెళ్ళాలి.. అప్పుడే పేదల ఇళ్ల వద్దకు వెళ్తాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం హైదరాబాద్ బర్కత్‌పురాలోని బీజేపీ సిటీ సెంట్రల్ జిల్లా ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సేవా పక్వాడ ఫోటో ఎగ్జిబిషన్‌ను రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, బండి సంజయ్, తదితర నేతలు కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి బండి మాట్లాడుతూ 'ప్రజాలరా? మీకు అండగా బీజేపీ ఉంది. మీ ఆస్తులను రక్షించే బాధ్యత తీసుకుంటాం. మీ ఆయుధం మేమవుతాం. పేదలకు ఆయుధంగా బీజేపీ మారబోతోంది. మీ ఇండ్లపై హైడ్రా బుల్డోజర్లు దిగాలంటే.. ముందు బీజేపీ కార్యకర్తలపైన, మాపైన బుల్డోజర్లపై దిగిన తరువాతే మీ ఇండ్లను తాకాలి. అందుకు పూర్తిగా సన్నద్ధమై ఉన్నం. ప్రభుత్వం కూడా పేదల ఇండ్ల కూల్చే ముందు దానికి సిద్ధం కండి. ఈ విషయంలో ఎందాకైనా తెగించి కొట్లాడేందుకు రెడీగా ఉన్నాం' అని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా, ఏ వ్యక్తిని కదిలించినా హైడ్రా దాడులపైనే చర్చ జరుగుతోందని బండి సంజయ్ అన్నారు. హైడ్రా దాడులను చూసి బాధపడనోడు పాపాత్ముడని విమర్శించారు. మరి ప్రభుత్వం ఎందుకు పున: సమీక్షించుకోవడం లేదో అర్థం కావడం లేదని, పైగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రచారం చేయిస్తున్నారని తెలిపారు.

సర్కార్ తీరు డామిట్ కథ అడ్డం తిరిగినట్లుగా ఉందన్నారు. పెద్దలు



ఆక్రమించిన భవనాలను కూలగొడతారని తాము మొదట భావించామని, కానీ పేదల ఇండ్లు కూలుస్తున్నారని ఆరోపించారు. కొత్త ఇల్లు కట్టుకుని గ్రుహ ప్రవేశం చేస్తే.. ఆ ఇంటి తోరణాలు వాడకముందే వచ్చి కూల్చేస్తున్నారని, అన్ని అనుమతులు తీసుకుని, బ్యాంకు రుణాలు తీసుకుని ఇండ్లు కట్టుకుంటే.. వాటిని కూల్చడం ఎంత వరకు న్యాయం? ఆ ఇండ్లపై దాడులు చేస్తే వాళ్లకు దిక్కెవరు.. అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ తీరుతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతిన్నదన్నారు. ప్రభుత్వ దాడులకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పేదలకు ఆయుధంగా బీజేపీ మారబోతోందని, ప్రభుత్వం దిగొచ్చేదాకా పోరాడుతుందని వెల్లడించారు. బీఆర్ఎస్ కు, మీకు తేడా ఏముంది? గతంలో బీఆర్ఎస్ కూడా ఇట్లనే చేసిందని ఫైర్ అయ్యారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి మృతి పట్ల మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌సంతాపం తెలిపారు. కొండాపూర్ లోని ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లి పురుషోత్తం రెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. కాగా, హైదరాబాద్ లోని మహాప్రస్థానం శ్మశాన వాటికలో ఈ రోజు పురుషోత్తం రెడ్డి అంత్యక్రియలను నిర్వహించనున్నారు. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు పురుషోత్తం రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వస్థలం ప్రస్తుత సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తాటిపాముల పురుషోత్తంరెడ్డి మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది. పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించేందుకు పలువురు గ్రామస్తులు హైదరాబాద్‌కు తరలివస్తున్నారు.

# ప్రపంచ శాంతికి ఊతం ఇస్తున్నది అనువాదమే..!

## (30 సెప్టెంబర్ "అంతర్జాతీయ అనువాద దినం" సందర్భంగా)

అనువాదం దేశ, భాషల సరిహద్దులను పెకిలిస్తుంది. అనువాదం ప్రపంచ దేశాల ప్రజలను కలుపుతుంది. సమాచార వితరణ వాహనం అవుతుంది. వివిధ వర్గాల ప్రజల సాంస్కృతిక వారసత్వ విజ్ఞాన సంపదల పంపిణీ మాధ్యమంగా పని చేస్తుంది. అనువాదం అవగాహనను పెంచుతుంది. అనువాదం అభివృద్ధికి ఇంధనంగా పని చేస్తుంది. పలు భాషలు నేర్చుకోవాలనే తపన పెంచి పోషించేది అనువాదమే. అనువాదం ప్రపంచ శాంతికి ఊతం ఇస్తుంది. రెండు భాషల ప్రజల మధ్య వారధిగా అనువాదకులు నిలుస్తున్నారు. తెలియని భాషను వినడం ఓ అయోమయ సందర్భం. బహు భాషావేత్తల అనువాద రచనలు విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ప్రపంచ దేశాల చరిత్ర, రాజకీయాలు, ఫిలాసఫీ, విభిన్న ఇతర అంశాలను ఆవిష్కరించడానికి అనువాదం ఆసరా అవుతుంది. ఒక భాషలోని అంశాన్ని అర్థవంతంగా, యదాతథ భావంతో మరో భాషలో వర్ణించడమే అనువాద ప్రక్రియ అవుతుంది. భాషా అనువాదం ప్రపంచ జనాభాను ఏకం చేసే ఓ నిశ్శబ్ద భాషా ధ్వని.

### ప్రపంచ, దేశవ్యాప్త భాషలు:

ప్రపంచవ్యాప్తంగా 7,117లకు పైగా భాషలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా ప్రజలు 23 భాషలను మాత్రమే మాట్లాడుతున్నారు. పప్వా గ్వినా దేశంలోని 8 మిలియన్ల ప్రజలు 800లకు పైగా భాషలు, ఇండోనేషియాలో 700లకు పైగా భాషలు మాట్లాడడం చూస్తున్నాం. ప్రపంచంలో అత్యధికంగా 130 కోట్ల మంది చైనీస్ భాషను, 90 కోట్లు మాండరిన్ భాషను మాట్లాడుతున్నారు. భారతదేశంలో 1,599 భాషల్లో పది వేలకు పైగా ప్రజలు మాట్లాడే భాషలు 121 ఉండగా అందులో 22 అధికార భాషలు ఉన్నాయి. భారతంలో దాదాపు 57 శాతం హిందీ, 8.85 శాతం బెంగాలీ, 8.18 శాతం మరాఠీ, 6.7 శాతం తెలుగు, 5.7 శాతం తమిళ్ ప్రథమ భాషను మాట్లాడే ప్రజలు ఉన్నారు. సాహిత్యంలో కవిత్వం, నవలలు, కథలు, ఇతర రచనలను ఒక భాష నుంచి మరొక భాషలోకి అనువాదం చేయడం, తద్వారా వివిధ భాషల సంస్కృతులను, విజ్ఞాన నిధులను తెలుసుకోవడం సర్వసాధారణం అవుతున్నది.

### అనువాద అనేక ప్రయోజనాలు:

ఒక భాషలోని అంశాన్ని అర్థవంతంగా, యదాతథ భావంతో మరో భాషలో వర్ణించడమే అనువాద ప్రక్రియ అవుతుంది. భాషా అనువాదం ప్రపంచ జనాభాను ఏకం చేస్తున్నది. 'వివిధ భాషలు/యాసలు మాట్లాడే ప్రపంచ మానవాళిని ఏకం చేయడానికి, వివిధ వర్గాల, భాషల, ప్రాంతాల, ఖండాల, దేశాల ప్రజల మధ్య అవగాహన పెంచడానికి, ఒక భాషలో అందుబాటులో ఉన్న విజ్ఞానాన్ని ఇతర భాషల ప్రజలకు చేర్చడానికి, ప్రపంచ శాంతి పరిరక్షణకు అనాదిగా అనువాద ప్రక్రియలు ఉపయోగపడుతున్నాయి. వివిధ భాషల్లో నిగూఢంగా దాగిన విజ్ఞానాన్ని లోక జనులకు తమ తమ భాషల్లోకి అనువదించి అందించుటలో అనువాదక సాహితీవేత్తలు ప్రధాన భూమిక నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానవాళి మధ్య స్నేహాన్ని పెంచడానికి, సమన్వయాన్ని చిగురింపజేయడానికి, భావ వ్యక్తీకరణకు, శాంతి భద్రతలను నెలకొల్పడానికి, సమగ్రాభివృద్ధికి అనువాదకులు దోహదపడుతున్నారు. భాషా సరిహద్దులను చేధించుకొని మేధో వికాసం, సాంస్కృతిక వైవిధ్యం, సమన్వయ సహకారం, విజ్ఞాన సమాజ స్థాపన, రాజకీయ అభిప్రాయ సేకరణ, సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడుకోవడం లాంటి ప్రధాన లక్ష్యాలను అధిగమించడానికి భాషా అనువాదం ఉపకరిస్తున్నది. ఐరాస అధికార భాషలైన అరాబిక్, చైనీస్, ఫ్రెంచ్, ఇంగ్లీష్, రష్యన్, స్పానిష్ భాషలకు చెందిన అనువాదకులకు ప్రతి ఏట 30 సెప్టెంబర్‌న ఐరాస తగు సత్కారాలను చేయుట ఆనవాయిగా మారింది. బహు భాషావేత్తల అనువాద రచనలు విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ప్రపంచ దేశాల చరిత్ర, రాజకీయాలు, ఫిలాసఫీ, విభిన్న ఇతర అంశాలను ఆవిష్కరించడానికి అనువాదం ఆసరా అవుతుంది.

### అంతర్జాతీయ అనువాద దినం–2024 నినాదం:

అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య' వేదికగా 1953 నుంచి 'అనువాద దినోత్సవాలు' నిర్వహిస్తున్నారు. ఇటలీకి చెందిన సెయింట్ ఫీస్ట్ అనే రచయిత గ్రీక్ భాష నుంచి లాటిన్ భాషలోకి తొలిసారి బైబిల్ గ్రంథాన్ని అనువాదం చేయడంతో ఆయన అమరత్వ దినం సందర్భంగా 30 సెప్టెంబర్‌న "అంతర్జాతీయ అనువాద దినం(ఇంటర్నేషన్ ట్రాన్స్‌లేషన్ డే)"ను పాటించాలనే ఐరాస తీర్మానంతో 2017 నుంచి ప్రతి ఏట నిర్వహించబడుతోంది. అంతర్జాతీయ అనువాదకుల సమాఖ్య నిర్ణయం ప్రకారం 'అంతర్జాతీయ అనువాద దినం - 2024' థీమ్‌గా "అనువాదం, పరిరక్షించుకోవలసిన ఓ అద్భుత కళ (ట్రాన్స్‌లేషన్, ఆన్ ఆర్ట్ వర్త్ ప్రొటెక్టింగ్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ఈ దినోత్సవ వేదికగా భాషా అడ్డంకులను అధిగమించడం, ఉత్తమ సమాచార వితరణ, వృత్తిపరమైన అవగాహన పెంచడం లాంటివి అనువాద విజ్ఞానం వల్ల ఒనగూరితాయి.

### అనువాద రంగంలో ఉద్యోగ అవకాశాలు:

బహుభాషా వేత్తలకు ట్రాన్స్‌లేటర్స్, పర్యాటక ప్రాంతాల్లో గైడ్స్, ఇంటర్‌ప్రిటర్స్, ట్రాన్స్‌లేషన్ ఎడిటర్స్, ట్రాన్స్‌లేషన్ ప్రాజెక్ట్‌మేనేజర్స్, ఫ్రీలాన్స్ ట్రాన్స్‌లేటర్స్, డిప్లొమాటిక్ ట్రాన్స్‌లేటర్స్, లీగల్/మెడికల్/వెబ్‌సైట్/లిటరరీ/టెక్నికల్ ట్రాన్స్‌లేటర్స్ లాంటి అనేక ఉద్యోగ అవకాశాలు అర్హులకు అందుబాటులో ఉన్నాయి. అనువాద ప్రక్రియను చిన్న చూపు చూడడం, అనువాదకులకు తగు ప్రాధాన్యాన్ని ఇవ్వకపోవడం మన అజ్ఞానం అవుతుంది. కనీసం రెండు భాషల్లో లోతైన భాషా పరిజ్ఞానం ఉన్నప్పుడే ఉత్తమ అనువాద రచనలు వస్తాయి. వివిధ దేశాల ప్రభుత్వాలు అనువాద రచనలకు, అనువాదకులకు ఆకర్షణీయ వేతనాలను మాత్రమే కాకుండా ఉత్తమ పురస్కారాలను కూడా అందజేస్తాయి. మనం కూడా మన మాతృభాషతో పాటు జాతీయ భాష హిందీ, అంతరాష్ట్ర భాష ఆంగ్లంలో పరిజ్ఞానాన్ని పొంది కనీసం త్రిభాషావేత్తలుగా పేరు తెచ్చుకుంటూ, ఆ భాషల్లో విడుదలవుతున్న ఉత్తమ రచనలను చదువుతూ విషయపరిజ్ఞానాన్ని పెంచి పోషించుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో అక్టోబరు 6దాకా ప్రజలకు అనుమతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు (2024 సెప్టెంబరు 28న) సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవం తొలి సంచికకు శ్రీకారం చుట్టారు. నేటినుంచి 8 రోజులపాటు కొనసాగే ఈ వేడుకలను ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సహకారంతో రాష్ట్రపతి నిలయం నిర్వహిస్తోంది. ఈశాన్య భారతంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాల సుసంపన్న విభిన్న సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడం ఈ వేడుకల లక్ష్యం.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– దేశంలోని సుసంపన్న సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతోపాటు కళలను ప్రోత్సహించడం మన సమష్టి బాధ్యతని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక వైవిధ్యం, వారి జానపద నృత్యాలు, సంగీతం, కళలు, సంప్రదాయ వస్త్రధారణ వంటివి మన దేశ వారసత్వంలో అంతర్భాగం. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత సంప్రదాయాలు, సమాజాలను పౌరులందరికీ సుపరిచితం చేసే ప్రయత్నంలో భాగంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

సాంస్కృతిక ఆదానప్రదానం పెంపొందడానికి ఈ మహోత్సవం ఒక అవకాశమని రాష్ట్రపతి పేర్కొన్నారు. దేశంలోని ఈశాన్య, దక్షిణ ప్రాంతాల మధ్య ఈ వేడుక ఒక వారధి కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈశాన్య ప్రాంత హస్తకళా నిపుణులు, కళాకారులు, సంప్రదాయాలు, ప్రతిభా ప్రదర్శన ద్వారా వారి సాధికారతకు ఈ మహోత్సవం దోహదం చేస్తుందని ఆమె విశ్వాసం వెలిబుచ్చారు.

తెలంగాణ గవర్నర్, కేంద్ర సాంస్కృతిక-పర్యాటక శాఖ మంత్రిసహా 8 ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారతీయ కళా మహోత్సవాలు తిలకించేందుకు సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 6 వరకూ ఉదయం 10:00 నుంచి రాత్రి 8:00 గంటల మధ్య ప్రజలను అనుమతిస్తారు. అలాగే https://visit.rashtrapatibhavan.gov.in ద్వారా కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. దీంతోపాటు నేరుగా వచ్చే సందర్శకులకు తక్షణ బుకింగ్ సౌలభ్యం కూడా ఉంది.

# కన్సల్టేటివ్ ఫోరం ఛైర్మన్‌గా నారా లోకేశ్

అమరావతి, సెప్టెంబర్ 29 : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ జీవోను విడుదల చేసింది. ఫోరం ఛైర్మన్‌గా మంత్రి నారా లోకేశ్ వ్యవహరించనున్నారు.

రెండేళ్ల కాలపరిమితితో ఇది పనిచేయనుంది. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య అనుసంధానకర్తగా ఈ ఫోరం పనిచేయనుంది. ప్రభుత్వ శాఖలను ఆర్టీజీఎస్ శాఖ సమన్వయం చేయనుంది.

# జిల్లా కోర్టు-స్వర్‌గేట్ పుణె మెట్రో సెక్షన్‌కు ప్రధాని ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మహారాష్ట్రలో సెప్టెంబరు 29న మధ్యాహ్నం 12:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రూ.11,200 కోట్లకుపైగా వివిధ ప్రాజెక్టులు జాతికి అంకితం, శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారు.

ఈ మేరకు పుణె మెట్రో రైల్ ప్రాజెక్టు తొలిదశ పూర్తి కావడానికి గుర్తుగా జిల్లా కోర్టు–స్వర్‌గేట్ మెట్రో సెక్షన్‌ను ఆయన ప్రారంభిస్తారు. భూగర్భంలో నిర్మించిన ఈ విభాగం కోసం రూ.1,810 కోట్లు వెచ్చించారు.

అలాగే ఇదే దశ కింద స్వర్గేట్–కత్రాజ్ మధ్య దాదాపు రూ.2,955 కోట్లతో చేపట్టే భూగర్భ మెట్రో రైలు మార్గం విస్తరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. సుమారు 5.46 కిలోమీటర్ల పొడవైన ఈ దక్షిణ భాగం విస్తరణలో మూడు స్టేషన్లు మార్కెట్ యార్డ్, పద్మావతి, కత్రాజ్ పూర్తిగా ఇందులో భాగమవుతాయి.

అటుపైన కేంద్ర ప్రభుత్వ జాతీయ పారిశ్రామిక కారిడార్ నిర్మాణ కార్యక్రమం కింద 7,855 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన విస్తృత ప్రగతిశీల ప్రాజెక్టు 'బిడ్కిన్ పారిశ్రామిక వాడ'ను ప్రధాని జాతికి అంకితం చేస్తారు. ఇది మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌కు దక్షిణాన 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీన్ని ఢిల్లీ–ముంబై పారిశ్రామిక కారిడార్ కింద దీనికి రూపమిస్తున్నారు. మరత్వాడా ప్రాంతంలో శక్తిమంతమైన ఆర్థిక కేంద్రంగా దీనికి ఎనలేని సామర్థ్యం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రూ.6,400 కోట్ల వ్యయంతో మూడు దశల్లో దీన్ని నిర్మిస్తోంది. ఈ కార్యక్రమాలతోపాటు షోలాపూర్ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఇక్కడి ప్రస్తుత టెర్మినల్ భవనాన్ని ఏటా 4.1 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా పునరుద్ధరించారు. ఈ విమానాశ్రయ అనుసంధానంతో పర్యాటకులకు, వాణిజ్య వ్యవహారాల కోసం తరచూ ప్రయాణించేవారికి, పెట్టుబడిదారులకు షోలాపూర్ మరింతగా అందుబాటులోకి వస్తుంది.

ఈ సందర్భంగా భిదేవాడలో క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే స్మారక తొలి బాలికల పాఠశాల నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన కూడా చేస్తారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీజేఐ చంద్రచూడ్



తిరుపతి, సెప్టెంబర్ 29 : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ తిరుమలలో పర్యటిస్తున్నారు. ఆయన తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ చంద్రచూడ్ గర్భాలయంలో శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆయన కుటుంబ సభ్యులకు పండితులు ఆశీర్వచనాలిచ్చారు. టీటీడీ ఈవో ఆయనకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిఎస్వో శ్రీధర్, డెప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# నెయ్యి కల్తీపై సిట్ దర్యాప్తు ప్రారంభం

తిరుపతి, సెప్టెంబర్ 29 : తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై లోతైన విచారణ చేస్తామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు సిట్‌కు బదిలీ అయిందని చెప్పారు..

కల్తీ నెయ్యి వ్యవహారంపై రెండో రోజు 'సిట్' విచారణ సాగుతోంది. తిరుపతి పోలీసు అతిథి గృహంలో నేడు మరోసారి సిట్ సభ్యులు భేటీ అయ్యారు. మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ , నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీపై విచారణ చేస్తామని పేర్కొన్నారు.

సిట్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు నిర్వహిస్తున్నారని వివరించారు. కల్తీ నెయ్యికి బాధ్యులైన అందరినీ విచారిస్తామన్నారు. నివేదిక సమర్పించడానికి కాలపరిమితి లేదని తెలిపారు

టి టి డి ప్రొక్యూర్‌మెంట్ జీఎం ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను సిట్ బృందం పరిశీలిస్తోంది. డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అదనపు ఎస్పీ వెంకటరావు నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు

టి టీ డ్ బోర్డు దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. నేడు ఈవో శ్యామలరావును వారు కలవనున్నారు. ఆయన్ను అడిగి పూర్తి వివరాలు తెలుసుకోనున్నారు.

కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సభ్యులు పలు ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టనున్నారు. దుండిగల్‌లో ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థను పరిశీలించనున్నారు. తమిళనాడుకూ వెళ్లనున్నారు.

తిరుమలలో లడ్డూపోటు, విక్రయ కేంద్రాలను మరో బృందం పరిశీలించనుంది.

లడ్డూ తయారీ ముడి సరుకులపై ఆరా తీయనున్నారు. తయారీలో పాల్గొంటున్న శ్రీవైష్ణవుల ను ప్రశ్నించనున్నారు.

టి టి డీ పరిపాలన భవనంలో మరో బృందం విచారణ చేపట్టనుంది. నెయ్యి కొనుగోలు, ఒప్పందాలు పరిశీలించనుంది. దీనికి సంబంధించి టి టి డీ, ఏఆర్ డెయిరీ మధ్య ఒప్పందాలపై ఆరా తీయనున్నారు

# మార్పును తీసుకు వచ్చే వారిగా నడుచుకోండి అంటూ యువ న్యాయవాద వృత్తినిపుణులకు రాష్ట్రపతి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు న అంటే 2024 సెప్టెంబరు 28న తెలంగాణ లోని హైదరాబాద్ లో జరిగిన నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ఇరవై ఒకటో స్నాతకోత్సవం లో పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ, మన రాజ్యాంగంలో మన స్వాతంత్ర్య పోరాటం తాలూకు ఆదర్శాలైన న్యాయం, ధర్మం, నీతి, స్వేచ్ఛ, విముక్తి, సమానత్వం, ఇంకా సోదరభావాలు ఇమిడిపోయి ఉన్నాయన్నారు. సమత భావన ను రాజ్యాంగం ప్రస్తావన లోను, ప్రాథమిక హక్కుల లోను ప్రతిష్ఠించడంతో పాటుగా న్యాయం అందజేతకు సంబంధించిన ప్రభుత్వ విధానంలో ఓ భాగం అయిన ఆదేశ సూత్రాలలో కూడా పొందుపరచుకొన్నామని రాష్ట్రపతి అన్నారు. ఆదేశ సూత్రాలు అందరికీ సమాన న్యాయాన్ని, ఉచిత న్యాయ సహాయాన్ని సూచిస్తున్నాయన్నారు. "ఆర్థిక లేదా ఇతర అశక్తతల కారణంగా ఏ పౌరుడు/పౌరురాలు న్యాయాన్ని అందుకొనే అవకాశాలను కోల్పోకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి" అని ఆదేశ సూత్రాలు బోధిస్తున్నాయన్నారు.

న్యాయ ప్రాప్తి సంపన్న వ్యక్తి కి వలె ఒక పేద వ్యక్తి కి దక్కక పోతుండడం దురదృష్టకరమన్నారు. అందరి మేలు కోసం ఈ న్యాయవిరుద్ధ పరిస్థితి మారితీరాలన్నారు. ఇలాంటి మార్పునకు మీరు ప్రతినిధులు కండి అంటూ న్యాయవాద వృత్తిని ఎంచుకొన్న యువతకు రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు.

ఇకమీదట న్యాయవాదులుగా తమ పాత్రను పోషించనున్న విద్యార్థులు వారి కక్షిదారుల ప్రయోజనాలను గురించి శ్రద్ధ తీసుకోవడంతో పాటుగా న్యాయాన్ని అందించడంలో న్యాయస్థానానికి సాయపడే బాధ్యతను కూడా వారి భుజాలకెత్తుకోవాలని రాష్ట్రపతి అన్నారు. న్యాయ రంగంలో వృత్తికుశలురుగా వారు ఏ భూమికను ఎంచుకొన్నప్పటికీ, వారు న్యాయవర్తన, ధైర్యం, ఇంకా సాహసం అనే విలువలకు సదా అంటిపెట్టుకొని ఉండాలి అని రాష్ట్రపతి హితవు పలికారు. న్యాయాధికారుల సమక్షంలో నిజం వైపున నిలిస్తే వారు మరింత బలవంతులుగా మారుతారని ఆమె స్పష్టంచేశారు.

నల్సార్ అనేక రంగాలలో ముందు నడుస్తుండడం చూసి తనకు సంతోషం కలుగుతోందని రాష్ట్రపతి అన్నారు. శారీరిక అశక్తత, న్యాయ సౌలభ్యం, కారాగార సంబంధి న్యాయం, బాలల సంబంధి న్యాయం, ఇంకా న్యాయ సంబంధి సహాయం.. వీటి విషయాలలో శ్రద్ధ తీసుకోవడంలో నల్సార్ చొరవలను ఆమె మెచ్చుకొన్నారు.

పశు న్యాయ కేంద్రం (ఏనిమల్ లా సెంటర్) ను నల్సార్ ఏర్పాటు చేసిందని తెలుసుకొని రాష్ట్రపతి సంతోషాన్ని వ్యక్తం చేశారు. మానవ జాతి శ్రేయానికి పశువులు, పక్షులు, వృక్షాలతో పాటు జలాశయాలను నేటి యువతరం పెంచి పోషిస్తుందన్న ఆశ ఉందని ఆమె అంటూ, ఈ దిశ లో నల్సార్ స్థాపించిన ఏనిమల్ లా సెంటర్ ఒక మంచి ముందడుగు అని అభినందించారు.

మహిళల సురక్ష ను పెంపొందించంలో సంఘంలోని అన్ని విభాగాలకు వాటా ఉంది అని రాష్ట్రపతి అన్నారు. మహిళా వకీళ్లతోను, న్యాయ విద్యార్థినివిద్యార్థులతోను ఒక జాతీయ స్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి సంబంధిత వర్గాలందరి సమర్థనను కూడగట్టి, ఆ యంత్రాంగాన్ని నెలకొల్పడంలో సాయాన్ని అందించండి అంటూ నల్సార్ కు, నల్సార్ పూర్వ పట్టభద్రులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ యంత్రాంగం మహిళలకు వ్యతిరేకంగా అత్యాచారాలను నివారించడానికి, ఆ తరహా అత్యాచారాల వ్యాజ్యాలను పరిష్కరించడానికి ఉమ్మడి ప్రయాసలకు పూనుకోవాలన్న ఆజ్ఞను తలదాల్చి శ్రమిస్తుందన్న విశ్వాసాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి

## –సైబర్ సెక్యూరిటీ, ఏఐ ఈవెంట్‌లో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 : మనిషిలో ఉండే రెండు బలహీనతలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. ఇసాకా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'సెక్యూరింగ్ ది ఫ్యూచర్ నావిగేటింగ్ ద ఇంటరాక్షన్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' పేరుతో వెస్టిన్ హైదరాబాద్‌లో ప్రత్యేక సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భయం, దురాశతోనే సైబర్ నేరాలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు జరిగిన నేరాల్లో 30శాతం వాటా సైబర్ క్రైమ్ ఆక్రమించిందని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్, రుణ యాప్‌ల మోసాలు విపరీతంగా పెరిగాయన్నారు. యూపీఐ చెల్లింపులు, క్రిప్టో నెట్‌వర్క్ ఉపయోగించి పెద్ద ఎత్తున మోసాలు చేస్తున్నారని తెలిపారు. అతి తక్కువ ఐటీ మౌలిక వసతులతోనే సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, వారి వద్ద అత్యాధునిక సాంకేతికత లేదని స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై అవగాహనరాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే ఎనిమిది బిలియన్ల సైబర్ నేరాలు జరిగాయని ఐటీ, ఎలక్ట్రానిక్స్ విభాగం డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా అన్నారు. రికవరీ మాత్రం ఇరవై శాతంలోపే ఉందని, ఐటీ, డేటా, పోలీసు, ఆడిటర్లు మేథోమథనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.



ఇసాకా హైదరాబాద్ చాప్టర్ ప్రెసిడెంట్ జీసీఎస్ శర్మ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రైవసీ, ఏఐపై చర్చించామని తెలిపారు. తమ చాప్టర్‌లో ఆడిటర్లు, బ్యాంకర్లు, సీఏలూ, ప్రభుత్వ ఉద్యోగులు, ఏఐ నిపుణులు, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్టులు ఉన్నారని, ఇసాకా 166 దేశాల్లో 228 చాప్టర్లను కలిగి 1.8లక్షల మంది సభ్యులతో విస్తరించిందన్నారు. కార్యక్రమంలో ఇసాకా బోర్డు వీపీ దినేశ్ దాస్, సెక్రటరీ జీవీ వంశీకృష్ణ, కోశాధికారి వెంకటరావ్, మెంబర్‌షిప్ డైరెక్టర్ రాజ్ పవార్, అకడమిక్ రిలేషన్ డైరెక్టర్ సతీష్ బొట్టా, ప్రొగ్రాం డైరెక్టర్ రజనీశ దాసరి, డైరెక్టర్ షీ లీడ్స్ టెక్ షారన్ గద్దాల, సలహాదారులు శ్రీరామ్ బిరుదవోలు, డైరెక్టర్ ప్రభుత్వ సంబంధాలు ఎంవీ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలతో సహా కాల్వలో దూకిన మహిళ..

అమరావతి, సెప్టెంబర్ 29 : ఆ మహిళకు ఏం ఆవద, కష్టమొచ్చిందో.. తన ఇద్దరు పిల్లలతో కలిసి ఓ కాల్వలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది ఓ మహిళ. ఈ ఘటన ఏపీలోని విజయవాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బెజవాడలో మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుంది. స్క్రూబ్రిడ్జి దగ్గర వండౌడ్ కాల్వలో ఇద్దరు పిల్లలతో సహా కాల్వలోకి దూకింది మహిళ.

ఈ క్రమంలో అక్కడున్న స్థానికులు గమనించి ఏడాదిన్నర వయసున్న చిన్నారిని బయటకు తీశారు. వెంటనే ఆ చిన్నారిని హాస్పటల్‌కు తరలించేలోపే చనిపోయింది. మరోవైపు.. తల్లి కుమారుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. మహిళ, మరో చిన్నారి కోసం కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్ లోని 'ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ' లో 'సఫాయి మిత్ర సురక్ష శివిర్'ను

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : కేంద్ర ఈశాన్యప్రాంత అభివృద్ధి, విద్యాశాఖల సహాయమంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఈ రోజు తెలంగాణా రాజధాని హైదరాబాద్ లోని 'ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ' లో 'సఫాయి మిత్ర సురక్షా షివిర్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'స్వచ్ఛతా హీ సేవా-2024' ప్రచారోద్యమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఉత్సాహంగా పాలుపంచుకున్న ఎన్ ఎస్ఎస్ కార్యకర్తలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ హరిబండి లక్ష్మి, డీన్, విద్యావేత్తలు, అధికారులు, అధ్యాపక బృందం, ఇతర సిబ్బంది, విద్యార్థులూ పాల్గొన్నారు. ప్రచారోద్యమం కింద చేపట్టిన కార్యకలాపాల గురించిన నివేదిక సమర్పించిన అనంతరం షార్ట్ ఫిల్మ్ ను ప్రదర్శించారు.

ఇఫ్లూలో 'జాతీయ విద్యా విధానం-2020' అమలు తీరుపై జరిగిన సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి, విద్యార్థుల సౌకర్యార్థం విశ్వవిద్యాలయంలో నూతన రీడింగ్ రూమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ళ చరిత్ర గల ఈ విద్యాసంస్థ 'జాతీయ విద్యా విధానం-2020' అమలుకు మార్గదర్శకాలను అందించి, 11 రాష్ట్రాలూ, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి దిక్సూచిగా నిలవడం తనకు సంతోషాన్ని కలిగించే విషయమని అన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమాల్లో ఒకటైన సాంకేతిక ఆర్థిక సహకార కార్యక్రమం-'ఐటిఇసి' కింద విదేశీ విద్యార్థులకు శిక్షణను అందించడంలో విశ్వవిద్యాలయ పాత్రను మంత్రి ప్రస్తావించారు. ఇప్పటి వరకూ 120 దేశాలకు చెందిన వేలాది మంది విదేశీ విద్యార్థులకు ఇఫ్లూ శిక్షణను అందించిందని చెప్పారు.

'స్వభావ్ స్వచ్ఛతా, సంస్కార్ స్వచ్ఛతా' సందేశ వ్యాప్తి కోసం ఇఫ్లూ 'స్వచ్ఛతా హీ సేవా' కింద చేపట్టిన వివిధ ప్రయోజనకర కార్యక్రమాలను మంత్రి ప్రశంసించారు. 'జన్ భాగీదారీ' స్ఫూర్తితో ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపక బృందం, ఇతర సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని ఉటంకిస్తూ స్వచ్ఛతను తమ జీవితాల్లో అంతర్భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారోద్యమంలో భాగంగా శ్రీ మజుందార్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు.

# భారత వైమానిక దళ 92వ వార్షికోత్సవం సందర్భంగా లడఖ్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు 7,000 కి.మీ. 'వాయు వీర్ విజేత' కార్ ర్యాలీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : భారత వైమానిక దళం (ఐఏఎఫ్) 92వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 8వ తేదీన లద్దాఖ్ లోని థోయిస్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ లోని తవాంగ్ వరకు 7 వేల కిలోమీటర్ల 'వాయు వీర్ విజేత' కార్ ర్యాలీని నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ ప్రారంభానికి ముందుగా, అక్టోబర్ 01న న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక ప్రాంతం వద్ద రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ లాంఛనంగా వీడ్కోలు పలుకుతారు. సముద్ర మట్టానికి 3,068 మీటర్ల ఎత్తులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వైమానిక స్థావరం థోయిస్ నుండి అక్టోబర్ 8 వ తేదీన అధికారికంగా ర్యాలీ ప్రారంభమై, అక్టోబర్ 29న తవాంగ్ వద్ద ముగుస్తుంది.

ఈ ర్యాలీని ఉత్తరాఖండ్ యుద్ధ స్మారక అనుభవజ్ఞుల సహకారంతో భారత వాయు సేన నిర్వహిస్తోంది. ఐఏఎఫ్ ఘనచరిత్ర గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం దీని లక్ష్యం. యుద్ధాల్లో, సహాయక చర్యల్లో వైమానిక యోధులు ప్రదర్శించిన ధైర్య సాహసాలను ప్రజలకు తెలియజెప్పడం కూడా ఈ ర్యాలీ ఉద్దేశంగా ఉంది. మాతృభూమికి సేవ చేసే దిశగా యువతలో స్ఫూర్తిని రగిలించేలా ర్యాలీ కొనసాగుతుంది. ఈ మెగా కార్ ర్యాలీలో మహిళలతో సహా 52 మంది వైమానిక దళ సిబ్బంది పాల్గొంటారు. మాజీ వైమానిక దళాధిపతులు కూడా వివిధ ప్రాంతాల్లో పాల్గొంటారు. మార్గమధ్యంలో ఎయిర్ వారియర్స్ (వాయు వీరులు) 16 ప్రాంతాల్లో ఆగుతూ, వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులను కలవనున్నారు. ఐఏఎఫ్ కు చెందిన సాహస విభాగం ఈ ర్యాలీకి నేతృత్వం వహిస్తోంది.

# ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి- డా.జస్టిస్ మన్మథ రావు

కర్నూలు, సెప్టెంబర్ 29 : ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) డా.జస్టిస్ మన్మథ రావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా న్యాయస్థాన ఆవరణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో టిజివి గ్రూప్ సహకారంతో ద్విచక్ర వాహనాదారులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి డా.జస్టిస్ మన్మథ రావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ బి.బిందు మాధవ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) డా.జస్టిస్ మన్మథ రావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గతంలో తాను హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న క్రమంలో వివిధ ప్రాంతాలకు ద్విచక్రవాహనం మీద ప్రయాణం చేయాల్సి వచ్చేదని, అప్పుడు హెల్మెట్ వాడకం అలవాటుగా ఉండడం వల్ల ప్రమాదాల నుంచి బయట పడటం జరిగిందన్నారు.

ప్రజలు వారి దినచర్యలో భాగంగా పనుల రీత్యా బయటకు రావడం జరుగుతుందని, అప్పుడు పలు రోడ్డు ప్రమాదాలు ద్విచక్రవాహనాల ద్వారా జరుగుతున్నాయని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయస్థానం ద్విచక్రవాహన ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరి చేయడం జరిగిందన్నారు. అందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, టిజివి గ్రూప్ సహకారంతో 200 మంది ద్విచక్ర వాహనాదారులకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా హెల్మెట్లు తీసుకున్న వారు హెల్మెట్లు ఇంట్లో ఉంచకుండా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ఇతరులలో స్ఫూర్తిని నింపాలన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి మాట్లాడుతూ? హెల్మెట్ తీసుకున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

అదే విధంగా ద్విచక్ర వాహనదారులకు అవసరమైన హెల్మెట్లు పంపిణీ చేసిన టిజివి ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హెల్మెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని, అందుకు వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ఖచ్చితంగా వాడాలన్నారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని భద్రతా ప్రమాణాలను పాటిస్తూ వాహనాన్ని నడపాలన్నారు.

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్ ను ఒక ఇబ్బందిగా భావించి హెల్మెట్ ను వాడడం లేదని, కానీ హెల్మెట్ ధరించడం వల్ల పెద్ద ప్రమాదంలో సైతం చిన్న గాయాలతో బయటపడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ప్రతి నెలలో ఒకసారి రహదారి భద్రతా సమావేశాలు నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు వారు చేరాల్సిన గమ్యస్థానాలకు సరైన భద్రతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు.

జిల్లా ఎస్పీ బి.బిందు మాధవ్ మాట్లాడుతూ వాహనం నడిపే వారు హెల్మెట్ వాడకం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కాకుండా చిన్న దెబ్బలతో బయట పడే అవకాశం ఉందంటున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహన యాజమాన్యాలు కూడా వాహనం అమ్మే సమయంలో హెల్మెట్ తప్పనిసరి చేయడం వల్ల ద్విచక్ర వాహనాల ప్రమాదాలు తగ్గడం జరిగిందన్నారు. అదే విధంగా వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరిస్తే వాహన ప్రమాదాలు పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు వాహనదారులకు హెల్మెట్ వాడకం పట్ల వాహనదారులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గత సంవత్సరంలో 3703 రోడ్డు ప్రమాదాలు జరుగగా అందులో 3042 రోడ్డు ప్రమాదాలలో వాహనదారులు హెల్మెట్ ఉపయోగించలేదన్నారు. అందుకు జిల్లాలోని న్యాయ సేవాధికార సంస్థ, రవాణా, పోలీసు, న్యాయవాదులు హెల్మెట్ వాడకం పట్ల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అందులో భాగంగా టిజివి గ్రూప్ సహకారంతో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 200 మందికి హెల్మెట్లు అందించి వాటిని తప్పనిసరిగా వినియోగించేలా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల), జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శాలువాతో సత్కరించారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి (కర్నూలు, నంద్యాల) వారు పోలీసు, స్కౌట్స్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, టిజివి సంస్థ లీగల్ అడ్వైసర్ అడ్వైజర్ శ్రీనివాసులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న కొత్త రాజకీయ పార్టీ ప్రారంభం: ప్రశాంత్ కిషోర్



పాట్నా, సెప్టెంబర్ 29 : రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక ప్రకటన చేశారు. అక్టోబర్ 2న బీహార్‌లో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీ పేరు, నాయకత్వంతో సహా అన్ని వివరాలు ఆ రోజు వెల్లడిస్తానని చెప్పారు. 'జన సురాజ్' పేరుతో బీహార్‌లో పాదయాత్ర చేస్తున్న ప్రశాంత్ కిషోర్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'అక్టోబరు 2న కొత్త పార్టీ 'జన సూరజ్'తోపాటు నాయకత్వ ప్రకటన గురించి మీరు తెలుసుకుంటారు. నేను నాయకుడిని కాదు. నాయకుడు కావాలని ఎప్పుడూ ఆశించలేదు. అక్టోబర్ 2న ఏర్పాటవుతున్న ఈ పార్టీకి నేనెప్పుడూ నాయకుడిగా ఉండను. ప్రజలు నాయకత్వ పాత్ర పోషించాల్సిన సమయం ఇది' అని అన్నారు.

కాగా, 2022 అక్టోబర్ 2న చేపట్టిన 'జన సూరాజ్' పాద యాత్ర మొదటి దశలో భాగంగా బీహార్‌లో 60 శాతం ప్రాంతాలను పూర్తి చేసినట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఈ యాత్రకు నిర్ణీత రోజులు లేదా కిలోమీటర్ల సంఖ్య లేదన్నారు. ప్రధానంగా మూడు ఉద్దేశాలు నెరవేర్చడం కోసం బీహార్‌లోని ప్రతి మూలకు వెళ్లాలన్నది తన లక్ష్యమని చెప్పారు.

మరోవైపు కొత్త పార్టీ ఏర్పాటు తర్వాత కూడా తన పాదయాత్ర ఆగదని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. మరో ఏడాది లేదా రెండేళ్ల వరకు ఇది కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీహార్ సవాళ్లకు పరిష్కారాలతో రెండో దశ యాత్ర ప్రణాళికను 2025 ఫిబ్రవరి లేదా మార్చిలో వెల్లడిస్తానని అన్నారు.

# జగన్ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగింది-మంత్రి నిమ్మల సంచలన వ్యాఖ్యలు

అమరావతి, సెప్టెంబర్ 29 : :రాష్ట్ర విభజన కంటే కూడా జగన్ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో పర్యటించిన ఆయన ఎన్టీఆర్ టిడ్కో గృహాలను పరిశీలించారు.

అనంతరం నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. పేదల కల నెరవేరాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో 80 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను పూర్తి చేయకుండా.. వైసీపీ ప్రభుత్వంలో ఆ ఇళ్లకు రంగులు వేశారని అన్నారు. రంగులు వేయడంలో చూపిన శ్రద్ధ.. పెండింగ్‌లో ఉన్న 20 శాతం పనులు పూర్తి చేయడంలో పెట్టలేదని మండిపడ్డారు.

చంద్రబాబు హయాంలో పూర్తయిన టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి 5 వేల కోట్ల రూపాయలను అప్పటి సీఎం జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని మంత్రి నిమ్మల విమర్శించారు. ఇళ్లను తాకట్టు పెట్టిన ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడి నెత్తిమీద ఐదారు లక్షల అప్పు పెట్టి దగా చేసిందని మండిపడ్డారు. టిడ్కో ఇళ్లను అప్పగించకుండానే పేదలు, మహిళలపై గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధించిందని అన్నారు. టిడ్కో ఇళ్లకు పునర్వైభవం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అతి త్వరలో ఇళ్లను అందజేస్తామని పేర్కొన్నారు. ప్రపంచస్థాయిలో మళ్లీ అమరావతిని నిలబెట్టేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని వెల్లడించారు.

# భారత నావికాదళం నిర్వహణలో 'థింక్ 2024' క్విజ్ కార్యక్రమం ముగిసిన తొలి రౌండ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : భారత్ నావికాదళం ఆధ్వర్యంలో జరుగుతున్న 'థింక్ 2024' క్విజ్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 10న తొలి ఎలిమినేషన్ రౌండ్ జరిగింది. 12,655 పాఠశాలలకు చెందిన విద్యార్థి బృందాలు పోటీ పడ్డ ఈ జాతీయ స్థాయి క్విజ్.. తొలి మూడు రౌండ్లు సెప్టెంబర్ 25న ముగిశాయి.

అర్హత సాధించిన బృందాలు, అక్టోబర్ 14-15 తేదీల్లో వీడియో మాధ్యమం ద్వారా జరిగే 'జోనల్' స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

జూలై 15న నమోదు ప్రక్రియ ప్రారంభించిన 'థింక్ 24' క్విజ్... ఎలిమినేషన్ రౌండ్లు పూర్తి చేసుకుని పోటీ సగం దూరానికి చేరుకుంది. 2047 కల్లా భారత్ ను సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ఆశయానికి అనుగుణంగా ఈ ఏడాది క్విజ్ ఇతివృత్తాన్ని 'వికసిత్ భారత్'గా నిర్ణయించారు. ఈ క్విజ్ లో కేవలం విద్యార్థుల సాధారణ అవగాహనను పరీక్షించడమే కాక, వారి మస్తిష్కాలకు పదును పెట్టి, జాతి నిర్మాణంలో తమ పాత్రను గురించిన అవగాహనను పెంచి, తద్వారా వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం పోటీ లక్ష్యం.

ఇక నవంబర్ 7,8 తేదీల్లో కేరళలోని ఏళిమలలో జరిగే 'థింక్ 24' క్విజ్ సెమీఫైనల్స్, ఫైనల్ పోటీలను ఇండియన్ నేవల్ అకాడమీ వేదికగా సదరన్ నేవల్ కమాండ్ నిర్వహిస్తుంది.

# జనవరిలో కుంభమేళా.. 992 ప్రత్యేక రైళ్లను నడపనున్న భారతీయ రైల్వే..!




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : కుంభమేళా కోసం పెద్ద సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది. కుంభమేళా సందర్భంగా 992 ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. వచ్చే ఏడాది జనవరిలో ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా జరుగనున్నది. ప్రత్యేక రైళ్లను నడపడంతో పాటు వివిధ మౌలిక నదుపాయాలు, ప్రయాణికులకు సౌకర్యాల కల్పన కోసం మంత్రిత్వశాఖ రూ.933 కోట్లను సైతం కేటాయించింది. ప్రస్తుతం రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్ డివిజన్, పరిసర ప్రాంతాల్లోనూ రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు రూ.3,700 కోట్లతో రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

జనవరి 12 నుంచి ప్రారంభమయ్యే కుంభమేళా సందర్భంగా భారీ సంఖ్యలో భక్తుల రద్దీని ఎదుర్కొనేందుకు ఏర్పాట్లను సమీక్షించేందుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో పాటు రవ్‌నీత్ సింగ్ బిట్టు, వీ సోమన్న సమావేశాలు నిర్వహించారు. సన్నాహాలను పరిశీలించేందుకు ఉత్తర రైల్వే, ఉత్తర మధ్య రైల్వే, ఈశాన్య రైల్వే జోన్లకు చెందిన జనరల్ మేనేజర్లు సహా సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కుంభమేళాకు 30 నుంచి 50కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. వివిధ నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు 6,580 సాధారణ రైళ్లతో పాటు 992 ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. సీనియర్ రైల్వే అధికారి మాట్లాడుతూ 2019లో జరిగిన కుంభమేళాకు 24 కోట్ల మందికిపైగా ప్రజలు హాజరయ్యారని తెలిపారు. ఆ సమయంలో 5వేల సాధారణ, అదనంగా 694 ప్రత్యేక రైళ్లను నడిపించినట్లు తెలిపారు.

ప్రస్తుతం ప్రత్యేక రైళ్ల సంఖ్యను 42శాతం పెంచి 992 నడిపించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇంకా రైళ్లను పెంచాల్సిన అవసరం ఉంటే.. బ్యాకప్ ప్లాన్‌తో సిద్ధంగా ఉన్నామన్నారు. వివిధ ఓవర్ బ్రిడ్జి పనులకు సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మరో అధికారి తెలిపారు. మిగతా రూ.495కోట్లతో స్టేషన్‌లకు వెళ్లే రోడ్ల మరమ్మతులు, ప్లాట్‌ఫారమ్‌లు, చుట్టుపక్కల సీసీ కెమెరాల ఏర్పాటు, స్టేషన్లలో వెయిటింగ్ హాల్స్‌తో పాటు ప్రయాణికుల కోసం అదనపు వసతి యూనిట్లు, వైద్య సదుపాయాలు తదితర కార్యకలాపాల కోసం వెచ్చించనున్నట్లు తెలిపారు. వారణాసి-ఝూన్సీల మధ్య రైల్వే లైన్ల డబ్లింగ్ పూర్తయ్యిందని.. ప్రయాగ్‌రాజ్-రాంబాగ్-ఝూన్సీ, జంఘై-ఫఫమౌ లైన్లు కుంభమేళాకు ముందే సిద్ధం చేస్తామని అధికారులు వివరించారు.

# పైడితల్లమ్మ సిరిమాను చెట్టు తరలింపు ప్రక్రియ - ఎమ్మెల్యే అదితి గజపతి పూజలు



విజయనగరం, సెప్టెంబర్ 29 : శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను, ఇరుసుమాను వృక్షాలను భూదేవి నుండి వేరు చేసే ప్రక్రియలో భాగంగా శనివారం డెంకాడ మండలం పెదతాడివాడలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రక్రియను ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సుమారు గత 250 ఏళ్లుగా ఎంతో వైభవంగా జరుపుకుంటున్నామని, ప్రతి ఏడాది పూజారి కలలో కనిపించి అమ్మవారు సిరిమాను వృక్షాన్ని తెలపడం జరుగుతుందని, ఆ వృక్షాన్ని ప్రార్థించి ఈరోజు భూదేవి నుండి వేరు చేయడం జరుగుతుందన్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరిగిందని, ఫలితంగా ఈసారి రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని తెలిపారు. శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ అక్టోబర్ 14వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 15వ తేదీన సిరిమాను ఊరేగింపు జరుగుతుందన్నారు.

గత ఏడాది నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసిన సందర్భంలో ఆయనకు పైడితల్లి అమ్మవారి పండుగ రోజున బెయిల్ రావడం జరిగిందని, ఈ ఏడాది ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన రోజున అమ్మవారి పండుగ పందిరి రాట వేయడం జరిగిందని గుర్తు చేశారు. విజయనగరం ప్రజలను, రాష్ట్ర ప్రజలను శ్రీ పైడితల్లి అమ్మవారు ఎల్లప్పుడూ కాపాడతారని అన్నారు.

# ఏడో తరగతి బాలికపై యువకుడి లైంగికదాడి.. గురువన్నపేటలో ఉద్రిక్త పరిస్థితులు

సిద్దిపేట , సెప్టెంబర్ 29 : సిద్దిపేట జిల్లాలోదారుణం చోటు చేసుకుంది. ఏడో తరగతి బాలికపై యువకు డు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కొమురవెల్లి మండలం గురువన్నపేటలో చోటు చేసుకుంది.

దీంతో ఆగ్రహించిన బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నిందితుడి ఇంటిని పెట్రోల్ పోసి తగులబెట్టారు.కారు, జేసీబీని ధ్వంసం చేశారు. గ్రామస్తుల దాడిలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మొగిలి ఘాట్ రోడ్డులో ప్రమాదం-మహిళ మృతి

చిత్తూరు, సెప్టెంబర్ 29 : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మొగిలి ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగి.. ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన మరువకముందే శనివారం ఉదయం మరో దుర్ఘటన జరిగింది. వెనుక నుండి వస్తున్న కారు అతివేగంతో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నం చేయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. 10 రోజుల వ్యవధిలో ఒకే స్థలంలో నాలుగు ప్రమాదాలు జరగడం గమనార్హం.

పలమనేరు వైపు నుంచి చిన్న హిటాచీల రోడ్డుతో వస్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు అతి వేగంతో వస్తూ ఓవర్ టక్ చేయడానికి ప్రయత్నం చేసింది. ఈ ఘటనలో కారును లారీ వెనుక వైపు తగిలింది. లారీ కుడి వైపు తిప్పడానికి ప్రయత్నం చేయగా, రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న మహిళను ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. లారీ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది.కారుకు వెనుక భాగం స్వల్పంగా దెబ్బతింది. కారులోని వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. లోడ్డుతో వస్తున్న లారీ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో హుటాహుటిన బంగారుపాలెం పోలీసులు అక్కడికి చేరుకొని పడిపోయిన లారీని పక్కకు లాగి, ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. బంగారుపాలెం సిఐ కే.శ్రీనివాసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన మహిళను శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగిన మంత్రి సత్యకుమార్..



అమరావతి, సెప్టెంబర్ 29 : స్వచ్ఛభారత్ నిర్మాణానికి పారిశుధ్య కార్మికులే స్ఫూర్తి ప్రదాతలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన జె.ఆర్ సిల్క్స అధినేత జింక రామాంజనేయులు దుస్తులు మంత్రికి అందజేయగా, వాటిని ఎండీఏ కార్యాలయంలో శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కార్మికులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. మీరు ప్రతిరోజు సమాజానికి అందించే సేవలు ఎంతో కీలకమైనవన్నారు. మీ సమర్థవంతమైన పనితీరు వల్లనే మన పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై మునుపటి కంటే మరింత దృష్టి పెట్టాలని మంత్రి పిలుపునిచ్చారు.

అనంతరం మంత్రి గత 30 సంవత్సరాలుగా మున్సిపాలిటీలో పనిచేస్తూ అమూల్యమైన సేవలు అందించిన పారిశుధ్య కార్మికులు ఎస్.సాలమ్మ, ఎం.పెద్ద నాగప్పల కాళ్లు కడిగారు.

ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు కేశవ, పార్థ, సంసన్, బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి, డి చర్లపల్లి నారాయణస్వామి, జింక చంద్ర, గోట్లూరు చంద్ర సాకే ఓబులేష్, కోటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# “ప్రక్రియలు-ఉత్పత్తుల ఆవిష్కరణపై అంతర్జాతీయ సదస్సు (ఎంఎంఎంఎం-2024)”సహా పర్యావరణ హిత ఉక్కు ఉత్పత్తిపై సార్వత్రిక చర్చాగోష్ఠికి కేంద్ర మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ శ్రీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : కేంద్ర ఉక్కు-భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఇవాళ “ఎంఎంఎంఎం-2024” పేరిట ఒక విస్తృత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా “లోహాల వెలికితీత ప్రక్రియలు-ఉత్పత్తుల ఆవిష్కరణ” అంశంపై అంతర్జాతీయ సదస్సు, ‘పర్యావరణ హిత ఉక్కు ఉత్పత్తిపై సార్వత్రిక చర్చాగోష్ఠి’ నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీలోని యశోభూమి వేదికగా 2024 సెప్టెంబరు 27 నుంచి 29 వరకూ ‘హైవ్ ఇండియా లిమిటెడ్, ఐఐఎం-ఢిల్లీ చాప్టర్, మెటలాజిక్ పిఎంఎస్, వరల్డ్ మెటల్ ఫోరమ్’ల ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ- నేడు అంతర్జాతీయంగా ఉక్కు ఉత్పత్తి భారీగా పెరిగిందని చెప్పారు. మునుపటితో పోలిస్తే కిలోల నుంచి 2 బిలియన్ టన్నుల స్థాయికి చేరువైందని పేర్కొన్నారు. మొత్తంమీద ప్రపంచ సామర్థ్యం 2.5 బిలియన్ టన్నులకు పెరిగిందని, ఇదంతా ఉక్కు రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, సామగ్రి సామర్థ్యం ఇనుమడించిన ఫలితమేనని అభివర్ణించారు.

జాతీయంగా, అంతర్జాతీయంగా ఉక్కుకు డిమాండ్ నిరంతరం పెరుగుతూనే ఉంటుందని శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. దీనివల్ల భారత ఉక్కు పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు తథ్యమని విశ్వాసం వెలిబుచ్చారు. ఈ రంగం 2024 ఆర్థిక సంవత్సరంలో 144 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించగా, ప్రస్తుతం 178 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్రపంచంలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఎదిగిందని ఆయన గుర్తుచేశారు.

ఉక్కు రంగం తన జీవిత చక్రంలో నేడు సరికొత్త మలుపు తిరిగిందని, పర్యావరణ కర్బన జాడలను తుడిచిపెట్టే దిశగా ఉద్గార స్థాయులు తగ్గించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ ప్రక్రియలలోనేగాక, సుస్థిర ఉక్కు ఉత్పత్తి లక్ష్యంగా డిజిటలీకరణ ఆధారిత భవిష్యత్తును రూపొందించుకోనుందని మంత్రి వ్యాఖ్యానించారు.

కార్యక్రమంలో పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ- భారత్ తన ఆర్థిక వ్యవస్థలో కర్బన ఉద్గార తీవ్రతను 2030 నాటికి 45 శాతానికిపైగా తగ్గిస్తుందని 2021 నవంబర్ 2నాటి ‘కాప్26’ సదస్సులో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రకటించడాన్ని శ్రీ వర్మ గుర్తుచేశారు. అంతేకాకుండా 2070 నాటికి నికరశూన్య ఉద్గార స్థాయిని చేరుకోగలమని కూడా ఆయన ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ప్రపంచ మొత్తం మీద వెలువడే ఉద్గారాలలో అంతర్జాతీయ ఉక్కు రంగం వాటా సగటున దాదాపు 8 శాతంగా ఉంటుంది. ఆ మేరకు టన్ను ముడి ఉక్కు ఉత్పత్తి నుంచి 1.89 టన్నుల దాకా కర్బన ఉద్గారం ఉద్భవిస్తుంది. కాగా, భారత్‌లో ఇది ప్రతి టన్నుకు 2.5 టన్నులుగా ఉన్న నేపథ్యంలో మొత్తం దేశీయ ఉద్గారాలలో ఈ రంగం వాటా సుమారు 12శాతంగా ఉంటోందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ఉక్కు మంత్రిత్వ శాఖ దేశీయ ఉక్కు రంగాన్ని కర్బనరహితం చేసే మార్గాన్వేషణ దిశగా వివిధ అంశాలపై 14 కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేసింది. ఇవన్నీ ఇచ్చిన నివేదికలోని సిఫారసుల ఆధారంగా “భారత్‌లో పర్యావరణ హిత ఉక్కు రంగం: భవిష్యత్ మార్గం-కార్యాచరణ ప్రణాళిక’’ పేరిట ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధనం, హరిత ఉదజని, పదార్థ పొదుపు, బొగ్గు ఆధారిత ‘డిఆర్ఐ’ నుండి సహజ వాయు ఆధారిత ప్రక్రియకు మార్పు, కర్బన సంగ్రహణం, వినియోగం-నిల్వ (సిసియుఎస్), ఉక్కు తయారీలో కర్రబొగ్గు (బయోచార్) వాడకం సహా వివిధ సాంకేతికతలపై సమగ్ర సిఫారసులు ఉన్నాయి.

కర్బన ఉద్గార తగ్గింపు మార్గాన్ని అనుసరించే సంస్థలు తమ కీలక వ్యూహాన్ని మెరుగుపరుచుకునే వీలుందని ‘బిసిజి’ ఇటీవలి నివేదిక ప్రముఖంగా పేర్కొనడాన్ని ఉక్కు మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి శ్రీ ఎన్.ఎన్.సిన్హా ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతర్గత విధానాల మెరుగుదలపై దృష్టి సారిస్తే ఉద్గార తీవ్రతను 10 నుంచి 40 శాతందాకా తగ్గించుకోవచ్చునని ఆ నివేదిక స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు ప్రభుత్వం ఇప్పటికే విస్పష్ట మార్గనిర్దేశం చేసినందున భారత ఉక్కు కంపెనీలు ఇకనైనా ముందుకు రావాలని సూచించారు.

అనంతరం ‘బిపిసిఎల్’ వాణిజ్య విభాగాధిపతి శ్రీ శుభంకర్ సేన్ మాట్లాడుతూ- భారత్ పెట్రోలియం ఉత్పత్తి చేసే ‘ఎంఎకె’ లూబ్రికెంట్లు ఉక్కు పరిశ్రమ అద్భుత వృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సుస్థిర పద్ధతులు, పర్యావరణ హిత ఉక్కు ఉత్పత్తిపై దృష్టి సారిస్తున్నందున 2030 నాటికి ఉత్పాదన 300 మిలియన్ టన్నులకు చేరగలదని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా “ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్-ఢిల్లీ చాప్టర్ నిర్వహిస్తున్న“లోహాల వెలికితీత ప్రక్రియలు-ఉత్పత్తుల ఆవిష్కరణ” అంశంపై అంతర్జాతీయ సదస్సు సంబంధిత సంపుటి, స్మారక సంచికలను మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆవిష్కరించారు.

చివరగా స్వల్ప కర్బన ఉద్గారాలతో ఉక్కు ఉత్పత్తివైపు ముందడుగు దిశగా మార్గనిర్దేశం చేశారు. ఈ మేరకు వినూత్న ప్రక్రియల ఆవిష్కరణ, ప్రాథమిక-ద్వితీయ స్థాయి లోహ ఉత్పత్తిదారులు, విద్యావేత్తలు, పరిశోధన-అభివృద్ధి సంస్థలు, మూలధన పరికరాల ఉత్పత్తిదారులు, లోహ వినియోగ రంగాల మధ్య బలమైన సహకారం అత్యంత కీలకమని పరిశ్రమ ప్రతినిధులకు మంత్రి స్పష్టం చేశారు.

# తెలంగాణలో రెండురోజులు పిడుగుల వానలు..!

హైదరాబాద్, సెప్టెంబర్ 29 : తెలంగాణలో రాబోయే రెండురోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది. సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న ద్రోణి.. ప్రస్తుతం కొమెరిన్ ప్రాంతం నుంచి ఇంటీరియర్ తమిళనాడు మీదుగా రాయలసీమ వరకు విస్తరించి ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఆదివారం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వానలుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# మెట్రో రైల్ రెండో దశ డీపీఆర్‌లకు తుదిమెరుగులు




హైదరాబాద్, సెప్టెంబర్ 29 : మెట్రో రైల్ రెండో దశ డీపీఆర్‌ల (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్) తయారీ పురోగతిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొద్ది రోజుల క్రితం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ సీనియర్ అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో రెండవ దశ కారిడార్‌ల అలైన్‌మెంట్, ముఖ్యమైన ఫీచర్లు, స్టేషన్లు మొదలైనవాటిపై సవివరమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు.

అన్ని కారిడార్‌లకు సంబంధించిన డీపీఆర్‌లకు తుది మెరుగులు దిద్దుతున్నామని, ట్రాఫిక్ అంచనాల విషయంలో హెచ్ఎండీఏ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాకి సిద్ధం చేస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక కోసం హెచ్ఏఎంఎల్ ఎదురుచూస్తోందని ఎండీ ముఖ్యమంత్రికి తెలియజేశారు.

మెట్రో మార్గాలలో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్-చెక్ చేయాల్సి ఉంటుంది. రెండవ దశ మెట్రో కారిడార్‌ల కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం డీపీఆర్‌లను సమర్పించడానికి ఇది తప్పనిసరి. గతంలో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయించిన ప్రకారం, ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ ఇప్పుడు ఆరామ్‌ఘర్, 44వ నెంబర్ జాతీయ రహదారి(బెంగళూరు హైవే)లోని కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా ఖరారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వివిధ ప్రత్యామ్నాయాల గురించి లోతైన చర్చల తర్వాత, ముఖ్యమంత్రి మెట్రో రెండో దశ కారిడార్‌ల విస్తృత కాంటూర్ లను ఆమోదించారు,

కారిడార్ ఎం (ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్) నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 36.6 కి.మీ పొడవును కవర్ చేస్తుంది.

ఎల్ బి నగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, డిఆర్‌డిఓ, చంద్రాయన్ గుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరంఘర్, న్యూ హైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా ఔఊ మీదుగా ఈ మార్గం ఉంటుంది.

ఈ ఎయిర్‌పోర్ట్ లైన్ వరుసగా నాగోల్, ఎల్‌బి నగర్, చంద్రాయన్ గుట్ట వద్ద ఉన్న అన్ని మెట్రో లైన్‌లకు అనుసంధానించబడుతుంది. మొత్తం 36.6 కి.మీ పొడవులో, 35 కి.మీ ఎలివేట్ చేయబడుతుంది, అలాగే 1.6 కి.మీ మార్గం భూగర్భంలో వెళ్తుంది.

ఈ మార్గంలో భూగర్భ స్టేషన్ అయిన ఎయిర్ పోర్ట్ స్టేషన్ తో సహా మొత్తం 24 మెట్రో స్టేషన్లు ఉంటాయి

కారిడార్ ఎ రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుండి కోకాపేట్ నియోపోలిస్ వరకు బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ మీదుగా బ్లూ లైన్ పొడిగింపుగా నిర్మించబడుతుంది.

ఇది మొత్తం ఎలివేటెడ్ కారిడార్. ఇందులో దాదాపు 8 స్టేషన్లు ఉంటాయి.

కారిడార్ ఎఎ (ఓల్డ్ సిటీ మెట్రో) ఎంజీబీఎస్ నుండి చంద్రాయన్ గుట్ట వరకు గ్రీన్ లైన్ పొడిగింపుగా నిర్మించబడుతుంది.

ఎంజీబీఎస్ నుండి ఈ 7.5 కి.మీ లైన్, ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా ప్రయాణిస్తుంది. కారిడార్ సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ నుండి 500 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ పేర్లనే వాటి చారిత్రక ప్రాముఖ్యత కారణంగా స్టేషన్ పేర్లుగా ఉంచడం జరుగుతుంది.

ప్రస్తుతం దారుల్‌షిఫా జంక్షన్ నుండి శాలిబండ జంక్షన్ మధ్య 60 అడుగుల రోడ్డు; శాలిబండ జంక్షన్ నుండి చంద్రాయన్ గుట్ట వరకు 80 అడుగుల రోడ్డు ఏకరీతిగా 100 అడుగులకు విస్తరించడం జరుగుతుంది. స్టేషన్ ఉండే ప్రాంతాలలో మాత్రం రోడ్డును 120 అడుగులకు విస్తరించడం జరుగుతుంది. రోడ్డు విస్తరణ, మెట్రో అలైన్‌మెంట్‌లో దాదాపు 1100 ఆస్తులు ప్రభావితమవుతున్నాయి. ప్రభావితమైన 400 ఆస్తులకు ఇప్పటికే నోటిఫికేషన్‌లు జారీ చేసాము. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ఈ మార్గంలో దాదాపు 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నాయి. వాటన్నింటికీ తగిన ఇంజినీరింగ్ పరిష్కారాలు, మెట్రో పిల్లర్ స్థానాల సర్దుబాటు ద్వారా అవి భంగం కాకుండా చూస్తున్నాము.

ఇది దాదాపు 6 స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ మెట్రో కారిడార్. కారిడార్ ఎఎ ముంబై హైవేపై రెడ్ లైన్ పొడిగింపుగా నిర్మించబడుతోంది. ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుండి ప్రారంభించి, పటాన్‌చెరు వరకు ఉన్న ఈ 13.4 కి.మీ లైన్ ఆల్విన్ ఔ రోడ్, మదీనాగూడ, చందానగర్, బిహెచ్ఈఎల్, ఇక్రిసాట్ మీదుగా వెళ్తుంది. ఇది దాదాపు 10 స్టేషన్లతో ఉండే పూర్తి ఎలివేటెడ్ కారిడార్.

కారిడార్ ఎఎఎ విజయవాడ హైవేపై ఎల్ బి నగర్ వైపు నుండి రెడ్ లైన్ పొడిగింపుగా నిర్మించడం జరుగుతుంది. ఎల్ బి నగర్ నుండి హయత్ నగర్ వరకు ఈ 7.1 కిమీ కారిడార్ చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ మీదుగా వెళుతుంది. ఈ పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌లో దాదాపు 6 స్టేషన్లు ఉంటాయి. సిఎం ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ లైన్ కోసం అనేక ఆకర్షణీయమైన ఫీచర్లతో వినూత్న రీతిలో డిపిఆర్ తయారు చేస్తున్నాము. కొన్ని నెలల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం దీనిని సమర్పించడం జరుగుతుంది. ఈ కొత్త లైన్ డీపీఆర్ మినహా మిగిలిన డీపీఆర్ లను త్వరలో నే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించబడతాయి.

ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ కోసం సుమారు రూ. 8,000 కోట్లతో కలిపి మొత్తం రెండవ దశ ప్రాజెక్ట్ కు అయ్యే వ్యయం దాదాపు రూ. 32,237 కోట్లు (రూ. 24,237 కోట్లు + రూ. 8,000 కోట్లు)గా అంచనా వేయబడింది. ఇతర భారతీయ నగరాల్లోని ఇతర మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌గా ఈ ప్రాజెక్ట్ అమలు చేయడానికి ప్రతిపాదించబడింది.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ఎం. దానకిశోర్, సీఎం స్పెషల్ సెక్రటరీ శ్రీ బి. అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ మిస్ అమ్రపాలి కాటా, ఇతర సీనియర్ అధికారులు ఈ చర్చలో పాల్గొన్నారు.

# ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొనే దివ్యాంగ చిన్నారులపట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం: శ్రీమతి అన్నపూర్ణా దేవి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : యూనిసెఫ్ తో కలిసి సుప్రీంకోర్టు-జువెనైల్ జస్టిస్ కమిటీ నిర్వహించిన 9వ దఫా సలహా సమావేశంలో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణ దేవి కీలకోపన్యాసం చేశారు. న్యూఢిల్లీలోని మధురా రోడ్డులోని సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఈ సమావేశం జరిగింది.

ఈసారి విభిన్న అంశాలకు చెందిన మిశ్రమ సమస్యలపై దృష్టిసారించారు. చట్ట సమస్యలను ఎదుర్కొంటున్న పిల్లలు, సంరక్షణ అవసరమైన పిల్లలు- అన్న కోణంలో చర్చలు సాగాయి. ఆసక్తిగలిగిన వారి మధ్య సంప్రదింపులు ప్రారంభం కావాలన్నది ఈ సలహా సమావేశపు లక్ష్యం. పిల్లల సంరక్షణ కోసం ముఖ్యంగా, వైకల్యంతో ఉన్న పిల్లల భద్రత, సంరక్షణల కోసం ఆచరణాత్మక అవగాహనను కలిగించడం కూడా ఈ సలహా సమావేశపు లక్ష్యాల్లో ఒకటి.

సుప్రీంకోర్టు- జువైనల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ బీవీ నాగరత్న తొలి పలుకులతో కార్యక్రమం ప్రారంభమైంది. దివ్యాంగులైన పిల్లల హక్కుల సంరక్షణ ప్రాముఖ్యతను జస్టిస్ నాగరత్న ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కీలకమైన పనిని నిర్వహించాల్సిన సమష్టి బాధ్యత ఈ రంగానికి చెందిన భాగస్వాములందరిమీదా ఉందని అన్నారు.

భారత ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్ ప్రారంభోపన్యాసం చేశారు. వ్యక్తిగత సామర్థ్యంతో సంబంధం లేకుండా పిల్లలందరూ పూర్తిస్థాయిలో ఎదగడానికి అవకాశం ఉన్న సమ్మిళిత సమాజాన్ని సృష్టించాల్సి ఉందని అన్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణాదేవి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు ఎదుర్కొంటున్న బహుముఖ సవాళ్లను పరిష్కరిం చడానికి ఒక సమగ్ర విధానం అవసరమని స్పష్టం చేశారు.

“పిల్లల రక్షణ అనేది కేవలం ఒక భావన కాదు. ప్రత్యేకించి వైకల్యాలున్న పిల్లల విషయాన్ని తీసుకుంటే ఈ రక్షణ అనేది మన ఉమ్మడి కర్తవ్యం. మన జనాభాలో దాదాపు మూడింట ఒకవంతు మంది పిల్లలే ఉన్నార”ని కేంద్ర మంత్రి అన్నారు. వారి సంక్షేమం, భద్రత పట్ల భారత్ కుగల దృఢమైన నిబద్ధతను నేటి సమావేశం మరోసారి స్పష్టం చేసిందని ఆమె అన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, ప్రతి బిడ్డ సురక్షితంగా ఎదగగలిగే వాతావరణాన్ని కల్పించడానికి కేంద్రప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోందని అన్నారు. పిల్లల రక్షణ కోసం మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు పెరిగిన నిధుల కేటాయింపులనేవి కేంద్రప్రభుత్వ నిబద్ధతను స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొనే దివ్యాంగ పిల్లలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. అందరూకలిసి పని చేయడం ద్వారా, వారి పరిస్థితులతో సంబంధం లేకుండా, చిన్నారులు అభివృద్ధి చెందేలా , వారి పూర్తి శక్తియుక్తులను పొందగలిగేలా చూడవచ్చని అన్నారు.

భారత్‌లో పని చేస్తున్న యునిసెఫ్ ప్రతినిధి శ్రీమతి సింథియా మెక్‌కాఫ్రీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలల హక్కులు, సంక్షేమాన్ని బలోపేతం చేయడంలో, ముఖ్యంగా ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్న చిన్నారుల సంక్షేమం కోసం యునిసెఫ్ చూపుతున్న నిబద్ధతను ఆమె తన ప్రసంగంలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణలో ఎదురవుతున్న సవాళ్లు, విజయాలను తెలిపే డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం సమగ్రమైన చర్చ జరిగింది.

ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కరదీపికను విడుదల చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. దివ్యాంగుల రక్షణ , సాధికారత కోసం సమర్థవంతమైన చర్యలను అమలు చేయడంలో సంబందిత వ్యక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఈ కరదీపిక దోహదం చేస్తుంది.


# ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్ మార్పు.. ఫోర్త్ సిటీ వరకు మెట్రో

హైదరాబాద్, సెప్టెంబర్ 29 :మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు తుది మెరుగులు దిద్దారు. మొత్తం 116.2 కిలోమీటర్లలో మెట్రో రెండు దశ నిర్మాణం జరగనుంది. రూ. 32,237 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో రైలు రెండో దశ చేపట్టనున్నారు. రెండో దశలో కొత్త ఫ్యూచర్ సిటీకి మెట్రోను ఏర్పాటు చేయనున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి స్కిల్ వర్సిటీ వరకు 40 కి.మీ. మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇటీవలే మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు.

ఆరాంఘర్ -బెంగళూరు హైవే కొత్త హైకోర్టు మీదుగా ఎయిర్‌పోర్టుకు మెట్రో ఖరారు చేశారు. కారిడార్ -4లో నాగోల్ - శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 36.6 కిలోమీటర్ల మార్గానికి ఆమోదం తెలిపింది. ఈ కారిడార్‌లో 1.6 కిలోమీటర్ల మేర భూగర్భంలో మెట్రో వెళ్లనుంది. రూ. 8 వేల కోట్ల అంచనా వ్యయంతో ఫోర్త్ సిటీకి మెట్రోను ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతుల కోసం త్వరలోనే మెట్రో రెండో దశ డీపీఆర్‌లు పంపనున్నారు.

మొదటి దశలో 3 కారిడార్లలో 69 కి.మీ. మేర మెట్రో నడుస్తుంది. రెండో దశలో మరో 6 కారిడార్లలో 116.2 కి.మీ. మేర మెట్రో ప్రయాణించనుంది. రెండో దశ పూర్తయితే మొత్తం 9 కారిడార్లలో 185 కి.మీ. మెట్రో పరుగులు తీయనుంది.

# ఆరోపణలకు ఆధారాల్లేవ్.. వాళ్లే నాపట్ల వివక్ష చూపించారు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తనపై వస్తున్న ఆరోపణలను ఖండించింది. తనది నియంతృత్వ ధోరణి అంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి లేఖ రాసిన 12 బంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులపై ఆమె మండిపడింది. వాళ్లు తనపై చేస్తున్నవి ఉత్త ఆరోపణలే అని, అందుకు ఆధారాలు లేవని ఉష తెలిపింది. అంతేకాదు ఎగ్జిక్యూటివ్ సభ్యుల్లో కొందరు అవినీతికి పాల్పడ్డారని, లింగ వివక్ష చూపించారని, వాళ్లలో కొందరిపై లైంగిక వేధింపుల కేసులు కూడా నమోదు అయ్యాయని ఉష వెల్లడించింది.

ఎగ్జిక్యూటివ్ కమిటీ సీఈవోగా రఘురామ్ అయ్యర్ నియామకంపై భిన్న వాదనల నేపథ్యంలో ఉష తీరును సభ్యులు తప్పు పట్టారు. ఆమెది నిరంకుశ ధోరణి, నియంతృత్వ పోకడ అంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ జెరొమె పొయివేకు 12 మంది సభ్యులు లేఖ రాశారు. అయితే.. వాళ్లు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పీటీ ఉష అంటోంది. సీఈఓగా రఘురామ్ అయ్యర్ ఎన్నికపై తాము రెండు సార్లు సమావేశం అయ్యామని.. అయితే రెండు వర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని ఆమె అంది.

అంతేకాదు ఆ మీటింగ్స్‌ను ఉద్దేశపూర్వకంగానే బోర్డు సభ్యులు రికార్డ్ చేయలేదని ఉష ఆరోపిస్తోంది. ‘నా 45 ఏండ్ల క్రీడా జీవితంలో ఎన్నో అంతర్జాతీయ వేదికలపై, ఎన్నో పోటీల్లో భారత దేశ ప్రతినిధిగా వ్యవహరించాను. అయితే.. మన అథ్లెట్లు, మన దేశ క్రీడా భవిష్యత్తు గురించి కాకుండా ఇతర విషయాలు మాట్లాడేవాళ్లను నేనెప్పుడు కలవలేదు’ అని ఉష ఈసీ సభ్యుల తీరును దుయ్యబట్టింది.

పారిస్ ఒలింపిక్స్ సమయంలోనూ ఉష తీరుపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. అనర్హతకు గురైన రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ను ఆస్పత్రిలో పరామర్శించిన ఆమె ఆ తర్వాత.. ‘బరువు అనేది క్రీడాకారుల బాధ్యత’ అంటూ కామెంట్ చేసింది. దాంతో, ఆమెపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. అందుకు వినేశ్ సైతం గట్టిగానే బదులిచ్చింది. తనతో బలవంతంగా ఓ ఫొటో దిగి.. దాన్ని సోషల్ మీడియాలో పెట్టి రాజకీయం చేశారని మాజీ రెజ్లర్ ఉషను ఉద్దేశించి కౌంటర్ ఇచ్చింది.

# ఆర్జీ కర్ హాస్పిటల్‌లోనే.. హత్యాచార ట్రైనీ డాక్టర్ శవపరీక్ష

కోల్‌కతా, సెప్టెంబర్ 29 : దేశ వ్యాప్తంగా కలకలం రేపిన కోల్‌కతా హత్యాచార బాధితురాలైన ట్రైనీ డాక్టర్ శవపరీక్షను ఆర్జీ కర్ హాస్పిటల్‌లోనే నిర్వహించారు. అక్కడి డాక్టర్లు, మృతురాలి తండ్రి డిమాండ్ మేరకు ఆమె విధులు నిర్వహించిన మెడికల్ కాలేజీలోనే పోస్ట్‌మార్టం జరిగిందని పోలీస్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 9న రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారంతోపాటు హత్య జరిగింది. సంచలనం రేపిన ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నది.

కాగా, బాధిత జూనియర్ డాక్టర్ మృతదేహానికి ఆర్జీ కర్ హాస్పిటల్‌లో ఎందుకు పోస్ట్‌మార్టం నిర్వహించారన్న దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నిష్పక్షపాతంగా ఉండేందుకు మరో హాస్పిటల్‌లో పోస్ట్‌మార్టం ఎందుకు నిర్వహించలేదని కొందరు జూనియర్ డాక్టర్లు ప్రశ్నించారు. సాక్ష్యాలను తారుమారు చేసేందుకే అరెస్టైన మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ ప్రభావంతో బాధితురాలి సొంత మెడికల్ కాలేజీలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మరోవైపు ఈ ఆరోపణలను ఖండించే పత్రాలను సీబీఐ సంపాదించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

పోస్టుమార్టానికి ముందు జూనియర్ డాక్టర్లు, బాధితురాలి తండ్రి ఐదు డిమాండ్లు చేశారు. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పర్యవేక్షణలో, మహిళా డాక్టర్ల సమక్షంలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలోనే పోస్టుమార్టం నిర్వహించాలని, వీడియో రికార్డ్ చేయాలని కోరారు.

# వాషింగ్టన్ డీసీలో 6వ భారత్-అమెరికా వాణిజ్య సమావేశానికి గినా రైమాండోతో కలిసి అధ్యక్షత వహించనున్న శ్రీ పియూశ్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : అమెరికా వాణిజ్య మంత్రి గినా రైమాండో ఆహ్వానం మేరకు భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూశ్ గోయల్ ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు అమెరికాలో పర్యటించనున్నారు.

అక్టోబరు 2న జరగనున్న భారత్-అమెరికా సీఈఓ ఫోరమ్ సమావేశానికి, 3న వాషింగ్టన్ డీసీలో జరగనున్న 6వ భారత్-అమెరికా వాణిజ్య చర్చలకు అమెరికా వాణిజ్య మంత్రి రైమాండోతో కలిసి శ్రీ పియూశ్ గోయల్ సహ అధ్యక్షత వహించనున్నారు. ఈ సందర్భంగా సుస్థిరమైన ఆర్థిక వృద్ధికి, వ్యాపార, పెట్టుబడి వాతావరణాన్ని మెరుగు పరిచేందుకు, భారతీయ, అమెరికన్ వ్యాపార సమాజాల మధ్య సంబంధాలను పటిష్ఠం చేసేందుకు ఉన్న మార్గాలపై ఇరు పక్షాలు చర్చించనున్నాయి.

భారత్‌లో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను ప్రధానంగా వెల్లడిస్తూ ప్రముఖ అమెరికన్, భారతీయ సీఈఓలు, పరిశ్రమ ముఖ్యులతో మంత్రి గోయల్ సమావేశమవుతారు. అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యాపార, పరిశ్రమ ముఖ్యులతో ఆయన చర్చించనున్నారు. భారత్, అమెరికా ఆర్థిక వ్యవస్థ మధ్య సంయుక్త బలాలు, సమ్మేళనాలను మరింత ప్రభావితం చేసే మార్గాలపై ప్రధానంగా చర్చలు ఉంటాయి. యువ వ్యాపార ప్రముఖుల రౌండ్‌టేబుల్ సమావేశంతో పాటు, భారత్-అమెరికా జెమ్స్ అండ్ జువెలరీ వాణిజ్య రౌండ్‌టేబుల్ సమావేశాలకు సైతం ఆయన అధ్యక్షత వహించనున్నారు.

భారత్, అమెరికా మధ్య కీలకమైన ఖనిజాల సరఫరా వ్యవస్థలను విస్తరించే, వైవిధ్యపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపైనా శ్రీ గోయల్, కార్యదర్శి రైమాండో చర్చిస్తారు. అవసరమైన కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను పెంచుకోవడానికి, వైవిధ్యపర్చడానికి, సంయుక్త బలాలను పెంచుకోవడానికి అవసరమైన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడానికి ఉద్దేశించిన ఒప్పందంపైనా ఇరుపక్షాలు చర్చలు జరుపనున్నాయి.

వాషింగ్టన్ డీసీలో యూఎస్‌టీఆర్ రాయబారి కాథెరీన్ తైతోనూ మంత్రి గోయల్ సమావేశమవుతారు. ట్రేడ్ పాలసీ ఫోరమ్ కింద ప్రస్తుతం కొనసాగుతున్న సహకారంతో పాటు, ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచే మార్గాలపై ఇరువురు చర్చించనున్నారు.

# మహారాష్ట్రలోని మర్వాడాలో పారిశ్రామిక వృద్ధి నవ శంకారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మహారాష్ట్రలోని ‘బిడ్కిన్ పారిశ్రామిక వాడ’ (బిఐఎ)ను వాస్తవిక సాదృశ (వర్చువల్) మాధ్యమం ద్వారా ఇవాళ జాతికి అంకితం చేశారు. దీంతో దేశ పారిశ్రామిక ప్రగతి కీలక మలుపు తిరిగినట్లయింది. కాగా, దీనికి సంబంధించి పుణె నగరంలో నిర్వహించిన ప్రధాన వేడుకలో మహారాష్ట్ర గవర్నర్ శ్రీ సి.పి.రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి శ్రీ ఏక్‌నాథ్ షిండే, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ‘ఆరిక్ హాల్’ నుంచి వెబ్‌కాస్ట్ చేయగా, ఇక్కడ మహారాష్ట్ర గృహనిర్మాణ-‘ఒబిసి’ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అతుల్ సేవ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ భగవత్ కరద్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ-ముంబై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా జాతీయ పారిశ్రామిక కారిడార్ నిర్మాణ కార్యక్రమం (ఎన్ఐసిడిపి) కింద 7,855 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ‘బిడ్కిన్ పారిశ్రామికవాడ’ ఒక విస్తృత ప్రగతిశీల ప్రాజెక్టు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌కు దక్షిణాన 20 కిలోమీటర్ల దూరంలో రూపుదిద్దుకున్న ఈ పారిశ్రామికవాడకు మరాఠ్వాడా ప్రాంతంలో ఆర్థిక వృద్ధి దిశగా ఉత్ప్రేరక పాత్ర పోషించగల అపార సామర్థ్యం ఉంది.

## ప్రాజెక్టు కీలకాంశాలు:

వ్యూహాత్మక భౌగోళిక ప్రదేశం: ఈ పారిశ్రామికవాడకు అన్నిరకాలుగా అద్భుత అనుసంధానం ఉంది. ఈ మేరకు జాతీయ రహదారి ‘752ఇ’కి పక్కన, నాగ్‌పూర్-ముంబై నగరాలను సంధానించే సమృద్ధి మహామార్గ్ నుంచి కేవలం 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అలాగే ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ 20 కి.మీ. విమానాశ్రయం 30 కి.మీ. దూరంలోనే ఉంటాయి. ఇక అతి ముఖ్యమైన జల్నా డ్రై పోర్ట్ 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అంటే- ‘పిఎం గతిశక్తి’ బృహత్ ప్రణాళిక సూత్రావళికి అనుగుణంగా నిరంతర బహుళ రవాణా అనుసంధాన సౌలభ్యంతో ‘బిఐఎ’ నిర్మితమవుతోంది.

దశలవారీ నిర్మాణం: కేంద్ర ప్రభుత్వం ?6,414 కోట్లతో మూడు దశల్లో ‘బిఐఎ’ను నిర్మిస్తోంది. ఈ మేరకు 2,511 ఎకరాల్లో చేపట్టే తొలిదశ (ఫేజ్-ఎ) పనుల కోసం ?2,427 కోట్లు వెచ్చించారు. “మహారాష్ట్ర ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ లిమిటెడ్ (ఎంఐటిఎల్), మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడిసి), నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసిడిఐటి)”ల మధ్య 51:49 భాగస్వామ్య నిష్పత్తితో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పివి) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అమలు చేసింది.

సంసిద్ధ మౌలిక సదుపాయాలు: ‘బిఐఎ’లో ఇప్పటికే విశాలమైన రహదారులు, నాణ్యమైన నీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్ సౌకర్యం, అధునాతన మురుగు-సాధారణ కలుషితాల శుద్ధి ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయి.

ఈ కీలక మౌలిక సదుపాయాల పనులు పూర్తికావడంతో పారిశ్రామిక, మిశ్రమ వినియోగార్థం కోరిన సంస్థలకు ప్లాట్ల కేటాయించడమే ఇక మిగిలి ఉంది.

## ప్రధాన పెట్టుబడులు - ఆర్థిక ప్రభావం

ఈ పారిశ్రామికవాడలో పెట్టుబడులకు ప్రసిద్ధ సంస్థలు ఇప్పటికే ఆసక్తి చూపాయి. ఈ మేరకు అథర్ ఎనర్జీ (100 ఎకరాలు), లుబ్రిజోల్ (120 ఎకరాలు), టయోటా-కిర్లోస్కర్ (850 ఎకరాలకు ‘ఎంఒయు’), జెఎస్‌డబ్ల్యు గ్రీన్ మొబిలిటీ (500 ఎకరాలు) వంటి కంపెనీలు పరిశ్రమల స్థాపనకు సిద్ధమయ్యాయి. ఈ నాలుగు సంస్థల ద్వారా ?56,200 కోట్లదాకా పెట్టుబడులు రానుండగా, 30,000కుపైగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

నిర్మాణం మొదలయ్యాక కేవలం మూడేళ్లలోనే పారిశ్రామిక, మిశ్రమ వినియోగ జోన్లలో 1,822 ఎకరాల (38 ప్లాట్లు) కేటాయింపు పూర్తయింది. ఈ నేపథ్యంలో ‘బిఐఎ’ నిర్మాణం ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక వృద్ధిపై గొలుసుకట్టు ప్రభావం చూపుతుందని, నిపుణ మానవ సౌలభ్యంతో పారిశ్రామికీకరణ వేగం పుంజుకుంటుందని అంచనా.

## పారిశ్రామిక నైపుణ్య వికాసం దిశగా ముందడుగు

బిడ్కిన్ పారిశ్రామిక వాడ (బిఐఎ)ను ప్రధాని నేడు జాతికి అంకితం చేయడం ప్రపంచ తయారీ రంగంలో అగ్రగామిగా నిలిచేలా భారత్ ముందంజకు బలమైన అడుగు కాగలదు. “మేక్ ఇన్ ఇండియా- మేక్ ఫర్ ది వరల్డ్'' నినాదానికి అనుగుణంగా సిద్ధమైన ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో పారిశ్రామికవృద్ధి, ఆర్థిక శ్రేయస్సు, సుస్థిర ప్రగతికి బాటలు పడతాయి.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ- పారిశ్రామిక నైపుణ్యానికి, ఉపాధి సృష్టికి, ఎగుమతులను పెంచడంతోపాటు ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'మన్ కీ బాత్' (మనసు లో మాట) కార్యక్రమం యొక్క 114 వ భాగంలో ప్రధాన మంత్రి ప్రసంగం పాఠం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : నా ప్రియమైన దేశవాసులారా! నమస్కారం. మరోసారి 'మన్ కీ బాత్' కార్యక్రమంతో మిమ్మల్ని కలిసే అవకాశం వచ్చింది. ఈరోజు ఎపిసోడ్ నన్ను భావోద్వేగానికి గురిచేస్తోంది. ఇది చాలా పాత జ్ఞాపకాలతో నన్ను చుట్టుముట్టింది. కారణం మన 'మన్ కీ బాత్' ప్రయాణం పదేళ్లు పూర్తి చేసుకుంటోంది. పదేళ్ల కిందట విజయదశమి పర్వదినమైన అక్టోబర్ 3వ తేదీన 'మన్ కీ బాత్' ప్రారంభమైంది. ఈ ఏడాది అక్టోబర్ 3వ తేదీన 'మన్ కీ బాత్' పదేళ్ల ప్రయాణం పూర్తి చేసుకుంటుంది. యాదృచ్ఛికంగా అది నవరాత్రుల మొదటి రోజు కావడం విశేషం.

'మన్ కీ బాత్' ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేను ఎప్పటికీ మరచిపోలేని అనేక మైలురాళ్లు ఉన్నాయి. 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వినే కోట్లాది శ్రోతలు ఈ కార్యక్రమానికి భాగస్వాములుగా ఉన్నారు. వారు నిరంతరం తమ సహకారాన్ని అందిస్తూనే ఉన్నారు. దేశంలోని ప్రతి మూల నుండి వారు సమాచారాన్ని అందిస్తూనే ఉన్నారు. ఈ 'మన్ కీ బాత్' కార్యక్రమానికి అసలైన సూత్రధారులు శ్రోతలే.

సాధారణంగా ఉబుసుపోక ముచ్చట్లు, నెగిటివ్ విషయాలు ఉంటే తప్ప ప్రజల దృష్టిని ఆకర్షించలేమన్న అభిప్రాయం ఉంది. కానీ 'మన్ కీ బాత్' దేశంలోని ప్రజలు సానుకూల సమాచారం కోసం ఎంతగా ఎదురుచూస్తున్నారో నిరూపించింది. సానుకూల అంశాలు, స్ఫూర్తిదాయకమైన ఉదంతాలు, ప్రోత్సహించే గాథలను ప్రజలు ఇష్టపడతారు. చకోర పక్షి కేవలం వర్షపు చినుకులు మాత్రమే తాగుతుందంటారు. అలాగే శ్రోతలు కూడా. చకోర పక్షి లాగే మన్ కీ బాత్ శ్రోతలు కూడా దేశ ప్రయోజనాల అంశాలను, ఉమ్మడి ప్రయోజనాల విషయాలను ఎంతో గర్వంతో వింటారు. ప్రతి ఎపిసోడ్ తో కొత్త గాథలు, కొత్త రికార్డులు, కొత్త వ్యక్తులను జోడించేవిధంగా ఒక ధారావాహికను 'మన్ కీ బాత్' సృష్టించింది. మన సమాజం లోని వ్యక్తులు సామూహిక స్ఫూర్తితో ఏ పని చేసినా వారికి 'మన్ కీ బాత్' ద్వారా గౌరవం లభిస్తుంది. 'మన్ కీ బాత్' కోసం వచ్చిన లేఖలు చదివితే నా హృదయం గర్వంతో నిండిపోతుంది. మన దేశంలో దేశసేవ, సమాజసేవ పట్ల గొప్ప అభిరుచి ఉండే చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారు. తమ జీవితాన్ని నిస్వార్థంగా దేశానికి, సమాజానికి సేవ చేయడానికి వారు అంకితం చేస్తారు. వారి గురించి తెలుసుకున్నప్పుడు నేను కొత్త శక్తితో నిండిపోతాను. 'మన్ కీ బాత్'లోని ఈ మొత్తం ప్రక్రియ నాకు గుడికి వెళ్లి భగవంతుని దర్శనం చేసుకున్నట్లుగా ఉంటుంది. 'మన్ కీ బాత్' లోని ప్రతి విషయం, ప్రతి సంఘటన, ప్రతి లేఖ గుర్తుకు వచ్చినప్పుడు ప్రజల రూపంలోని భగవంతుడిని చూస్తున్నట్లుగా అనిపిస్తుంది. భగవంతుడి రూపంగానే వారిని భావిస్తాను. ఆ భగవంతుని రూపాన్ని నేను దర్శిస్తున్నాను.

మిత్రులారా! దూరదర్శన్, ప్రసార భారతి, ఆకాశవాణిలతో అనుబంధంగా ఉన్న అందరినీ ఈ రోజు నేను అభినందిస్తున్నాను. వారి అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా 'మన్ కీ బాత్' ఈ ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రసారం చేసిన టీవీ ఛానెళ్లకు, ప్రాంతీయ టీవీ ఛానెళ్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 'మన్ కీ బాత్' ద్వారా లేవనెత్తిన అంశాలపై కొన్ని మీడియా సంస్థలు ప్రచారాన్ని కూడా నిర్వహించాయి. వారికి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రింట్ మీడియాకు, 'మన్ కీ బాత్'పై అనేక కార్యక్రమాలు చేసిన యూట్యూబర్లకు కూడా నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమం దేశంలోని 22 భాషలతో పాటు 12 విదేశీ భాషల్లో కూడా వినవచ్చు. 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని తమ ప్రాంతీయ భాషలో విన్నామని శ్రోతలు చెప్తుంటే నాకు ఆనందంగా ఉంటుంది. 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆధారంగా క్విజ్ పోటీ కూడా జరుగుతోందని మీలో చాలా మందికి తెలుసు. ఇందులోఎవరైనా పాల్గొనవచ్చు. ఓఎణనీల.తిని వెబ్ సైట్ ను సందర్శించడం ద్వారా మీరు కూడా పాల్గొనవచ్చు. బహుమతులు గెలుచుకోవచ్చు. ఈ గొప్ప సందర్భంలో నేను మీ అందరి నుండి మరోసారి ఆశీర్వాదాలు కోరుతున్నాను. స్వచ్ఛమైన మనసుతో, పూర్తి అంకితభావంతో– నేను ఇదేవిధంగా– భారతదేశ ప్రజల గొప్పతనాన్ని కీర్తిస్తూనే ఉంటాను. మనమందరం ఇదే విధంగా దేశ సామూహిక శక్తిని ఉత్సవంగా జరుపుకుందాం. ఇదే భగవంతుడితో నా ప్రార్థన. నరరూపంలో ఉన్న నారాయణులతో కూడా నా ప్రార్థన ఇదే!

నా ప్రియమైన దేశప్రజలారా! గత కొన్ని వారాలుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జల సంరక్షణ ప్రాధాన్యతను వర్షాకాలం గుర్తు చేస్తుంది. వర్షపు రోజుల్లో పొదుపు చేసుకున్న నీళ్లు నీటి సంక్షోభం సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయి. 'క్యాచ్ ది రెయిన్' వంటి ప్రచారాల వెనుక ఉన్న భావన ఇదే. నీటి సంరక్షణ కోసం చాలా మంది కొత్త కార్యక్రమాలు చేపడుతున్నందుకు నేను సంతోషిస్తున్నాను. అలాంటి ఒక ప్రయత్నం ఉత్తరప్రదేశ్‌లో కనిపించింది. నీటి కొరతకు గుర్తింపు పొందిన 'ఝాన్సీ' బుందేల్‌ఖండ్‌లో ఉందని మీకు తెలుసు. ఝాన్సీలో స్వయం సహాయక బృందంతో అనుబంధం ఉన్న మహిళలు ఘురారి నదికి కొత్త జీవితం ఇచ్చారు. 'జల్ సహేలీ'గా మారి, ఈ ఉద్యమానికి ఆ మహిళలు నాయకత్వం వహించారు. దాదాపు మృత స్థితిలో ఉన్న ఘురారి నదిని వారు రక్షించిన తీరు ఊహకు కూడా అందనిది. ఈ జల్ సహేలీలు ఇసుకను బస్తాలలో నింపి ఒక చెక్ డ్యామ్‌ను సిద్ధం చేశారు. వర్షం నీరు వృథా కాకుండా కాపాడారు. నదిని నీటితో నింపారు. వందలాది రిజర్వాయర్ల నిర్మాణం, పునరుజ్జీవనంలో ఈ మహిళలు చురుగ్గా దోహదపడ్డారు. ఈ ప్రాంత ప్రజల నీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా వారి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేలా చూశారు.

మిత్రులారా! కొన్ని చోట్ల జలశక్తిని నారీశక్తి పెంచుతుంది. మరికొన్ని చోట్ల నారీశక్తిని జలశక్తి బలోపేతం చేస్తుంది. మధ్యప్రదేశ్ లోని రెండు స్ఫూర్తిదాయక ప్రయత్నాల గురించి నాకు తెలిసింది. ఇక్కడ డిండోరీ లోని రాయపురా గ్రామంలో పెద్ద చెరువు కట్టడం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. దీనివల్ల అక్కడి మహిళలకు లబ్ధి కలిగింది. అక్కడి 'శారదా జీవనోపాధి స్వయం సహాయక బృందం'లోని మహిళలు చేపల పెంపకం వ్యాపారాన్ని కూడా మొదలుపెట్టారు. ఫిష్ పార్లర్ ను కూడా ప్రారంభించారు. అక్కడ వారి ఆదాయం కూడా చేపల విక్రయం ద్వారా పెరుగుతోంది. మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ మహిళల ప్రయత్నాలు కూడా ప్రశంసనీయం. అక్కడి ఖోప్ గ్రామంలో పెద్దచెరువు ఎండిపోవడంతో అక్కడి మహిళలు దాని పునరుజ్జీవనానికి కృషి చేశారు. 'హరి బగియా స్వయం సహాయక బృందా'నికి చెందిన ఈ మహిళలు చెరువులోని పూడిక మట్టిని పెద్ద మొత్తంలో తీశారు. చెరువులోంచి వచ్చిన పూడికమట్టితో బంజరు భూమిలో ఫల వనాన్ని సిద్ధం చేశారు. ఈ మహిళల కృషి వల్ల చెరువు పుష్కలంగా నిండడమే కాకుండా పంట దిగుబడి కూడా గణనీయంగా పెరిగింది. దేశంలోని ప్రతి మూలలో జరుగుతున్న ఇటువంటి నీటి సంరక్షణ ప్రయత్నాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో చాలా సహాయకారిగా ఉంటాయి. మీ చుట్టూ జరుగుతున్న అలాంటి ప్రయత్నాలలో మీరు కూడా తప్పకుండా పాల్గొం టారని నాకు నమ్మకం ఉంది.

నా ప్రియమైన దేశవాసులారా! ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో 'ఝూలా' అనే సరిహద్దు గ్రామం ఉంది. అక్కడి యువకులు తమ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారు తమ గ్రామంలో 'ధన్యవాదాలు ప్రకృతి– థాంక్యూ నేచర్' అనే ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా ప్రతిరోజు రెండు గంటల పాటు గ్రామాన్ని శుభ్రం చేస్తున్నారు. గ్రామంలోని వీధుల్లో ఉన్న చెత్తను సేకరించి గ్రామం వెలుపల నిర్దేశించిన స్థలంలో వేస్తారు. దీంతో 'ఝూలా' గ్రామం కూడా పరిశుభ్రంగా మారుతోంది. ప్రజల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామం, ప్రతి వీధి, ప్రతి ప్రాంతం ఇలాంటి థాంక్యూ ప్రచారం ప్రారంభిస్తే ఎంత పరివర్తన వస్తుందో ఒక్కసారి ఆలోచించండి!

మిత్రులారా! పుదుచ్చేరి సముద్ర తీరంలో పరిశుభ్రతపై అద్భుతమైన ప్రచారం జరుగుతోంది. అక్కడ రమ్య అనే మహిళ మాహే మున్సిపాలిటీతో పాటు ఆ పరిసర ప్రాంతాల యువ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. తమ కృషితో మాహే ప్రాంతాన్ని, ముఖ్యంగా అక్కడి బీచ్‌లను పూర్తిగా పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు ఈ బృందంలోని వ్యక్తులు.

మిత్రులారా! నేను ఇక్కడ రెండు ప్రయత్నాల గురించి మాత్రమే చర్చించాను. కానీ మనం మన చుట్టూ చూస్తే దేశంలోని ప్రతి ప్రాంతంలో పరిశుభ్రతకు సంబంధించి ఏదో ఒక ప్రత్యేకమైన ప్రయత్నం ఖచ్చితంగా జరుగుతుందని తెలుస్తుంది. మరికొద్ది రోజుల్లో అంటే అక్టోబర్ 2వ తేదీన 'స్వచ్ఛ భారత్ మిషన్' పదేళ్లు పూర్తి చేసుకుంటోంది. భారతదేశ చరిత్రలో ఇంత పెద్ద ప్రజా ఉద్యమం చేసిన వారిని అభినందించడానికి ఇది ఒక సందర్భం. జీవితాంతం ఈ లక్ష్యం కోసమే అంకితభావంతో నిలిచిన మహాత్మా గాంధీజీకి ఇదే నిజమైన నివాళి.

మిత్రులారా! ఈరోజు 'స్వచ్ఛ భారత్ మిషన్' విజయంతో 'వ్యర్థాల నుండి సంపద' అనే మంత్రం ప్రజల్లో ప్రాచుర్యం పొందుతోంది. ప్రజలు 'రెడ్యూస్, రీ–యూజ్, రీసైకిల్' గురించి మాట్లాడటం ప్రారంభించారు. వాటికి ఉదాహరణలు ఇవ్వడం మొదలుపెట్టారు. కేరళలోని కోజికోడ్‌లో ఒక అద్భుతమైన ప్రయత్నం గురించి నేను తెలుసుకున్నాను. అక్కడ డెబ్బై నాలుగు సంవత్సరాల వయసున్న సుబ్రహ్మణ్యన్ గారు 23 వేలకు పైగా కుర్చీలకు మరమ్మతులు చేసి, వాటిని మళ్లీ ఉపయోగించుకునేలా చేశారు. ప్రజలు ఆయనను 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్– అంటే త్రీఆర్ (ట్రిపుల్ ఆర్) ఛాంపియన్' అని కూడా పిలుస్తారు కోజికోడ్ సివిల్ స్టేషన్, పిడబ్ల్యుడి, ఎల్ఐసి కార్యాలయాలలో ఆయన చేసిన ఈ అపూర్వ ప్రయత్నాలను చూడవచ్చు.

మిత్రులారా! పరిశుభ్రతకు సంబంధించి జరుగుతున్న ప్రచారంలో వీలైనంత ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలి. ఈ ప్రచారం ఒక రోజు లేదా ఒక సంవత్సరం జరిగే ప్రచారం కాదు. ఇది యుగయుగాల వరకు జరగవలసిన నిరంతర కృషి. 'స్వచ్ఛత' మన స్వభావం అయ్యే వరకు చేయవలసిన పని ఇది. మీ కుటుంబసభ్యులు, స్నేహితులు, పొరుగువారు లేదా సహోద్యోగులతో కలిసి పరిశుభ్రత ప్రచారంలో పాల్గొనాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను. 'స్వచ్ఛ భారత్ మిషన్' విజయవంతం అయిన సందర్భంగా మీ అందరికీ మరోసారి అభినందనలు తెలియజేస్తున్నాను.

నా ప్రియమైన దేశప్రజలారా! మనమందరం మన వారసత్వం గురించి చాలా గర్వపడుతున్నాం. నేను ఎప్పుడూ చెప్తాను– వికాసంతో పాటు వారసత్వం కూడా ముఖ్యమని. ఈ కారణం వల్లే నా ఇటీవలి అమెరికా పర్యటనలో ఒక నిర్దిష్ట అంశం గురించి నాకు చాలా సందేశాలు వస్తున్నాయి. మన ప్రాచీన కళాఖండాలు తిరిగి రావడంపై మరోసారి చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించి మీ అందరి భావాలను నేను అర్థం చేసుకోగలను. 'మన్ కీ బాత్' శ్రోతలకు కూడా దీని గురించి చెప్పాలనుకుంటున్నాను.

మిత్రులారా! నా అమెరికా పర్యటన సందర్భంగా అమెరికా ప్రభుత్వం దాదాపు 300 పురాతన కళాఖండాలను భారతదేశానికి తిరిగి ఇచ్చింది. అమెరికా అధ్యక్షులు బైడెన్ పూర్తి ఆప్యాయతను ప్రదర్శిస్తూ, డెలావేర్‌లోని తన వ్యక్తిగత నివాసంలో ఈ కళాఖండాలలో కొన్నింటిని నాకు చూపించారు. తిరిగి వచ్చిన కళాఖండాలు టెర్రకోట, రాయి, ఏనుగు దంతాలు, కలప, రాగి, కాంస్యం వంటి పదార్థాలతో తయారయ్యాయి. వీటిలో చాలా వస్తువులు నాలుగు వేల సంవత్సరాల కిందటివి. నాలుగు వేల సంవత్సరాల కిందటి నుండి 19వ శతాబ్దం వరకు ఉన్న కళాఖండాలను అమెరికా తిరిగి అందించింది. వీటిలో పూల కుండీలు, దేవతల టెర్రకోట ఫలకాలు, జైన తీర్థంకరుల విగ్రహాలు, బుద్ధుడి ప్రతిమలు, శ్రీ కృష్ణుడి విగ్రహాలు ఉన్నాయి. తిరిగి వచ్చిన వస్తువులలో చాలా జంతువుల బొమ్మలు కూడా ఉన్నాయి. పురుషులు, స్త్రీల బొమ్మలతో జమ్మూ కాశ్మీర్‌లోని టెర్రకోట టైల్స్ చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. వీటిలో దక్షిణ భారతదేశానికి చెందిన కంచుతో చేసిన గణేశుని విగ్రహాలు కూడా ఉన్నాయి. తిరిగి వచ్చిన వస్తువులలో పెద్ద సంఖ్యలో విష్ణువు చిత్రాలు కూడా ఉన్నాయి. ఇవి ప్రధానంగా ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రాంతాలకు సంబంధించినవి. ఈ కళాఖండాలను చూస్తే మన పూర్వీకులు సూక్ష్మ నైపుణ్యాలపై ఎంత శ్రద్ధ చూపారో స్పష్టమవుతుంది. కళ పట్ల వారికి ఎంతో అద్భుతమైన అవగాహన ఉండేది. ఈ కళాఖండాలను చాలా వరకు అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ మార్గాల ద్వారా దేశం నుండి బయటకు తీసుకువెళ్ళారు. ఇది తీవ్రమైన నేరం. ఒక విధంగా ఇది మన వారసత్వాన్ని నాశనం చేయడం లాంటిది. అయితే గత దశాబ్దంలో ఇటువంటి అనేక కళాఖండాలు, మన పురాతన వస్తువులు చాలా వరకు తిరిగివచ్చాయని తెలియజేసేందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. ఈ దిశలో నేడు భారతదేశం కూడా అనేక దేశాలతో కలిసి పనిచేస్తోంది. మన వారసత్వం గురించి మనం గర్వపడుతున్నప్పుడు ప్రపంచం కూడా దాన్ని గౌరవిస్తుందని నేను నమ్ముతున్నాను. దాని ఫలితమే నేడు ప్రపంచంలోని అనేక దేశాలు మన దేశం నుండి తరలిపోయిన అటువంటి కళాఖండాలను తిరిగి ఇస్తున్నాయి.

నా ప్రియమైన మిత్రులారా! ఏ పిల్లవాడైనా ఏ భాషను సులభంగా, త్వరగా నేర్చుకుంటాడు అని నేను అడిగితే – మీ సమాధానం 'మాతృభాష' అనే వస్తుంది. మన దేశంలో దాదాపు ఇరవై వేల భాషలు, మాండలికాలు ఉన్నాయి. అవన్నీ ఎవరో ఒకరికి మాతృభాషలే. వ్యవహర్తల సంఖ్య చాలా తక్కువగా ఉన్న కొన్ని భాషలు ఉన్నాయి. కానీ నేడు ఆ భాషలను సంరక్షించడానికి ప్రత్యేకమైన ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుసుకుంటే మీరు సంతోషిస్తారు. అలాంటి భాషల్లో ఒకటి మన 'సంథాలీ' భాష. డిజిటల్ ఇన్నోవేషన్ సాయంతో 'సంథాలీ'కి కొత్త గుర్తింపు తెచ్చేలా ఉద్యమం మొదలైంది. మన దేశంలోని అనేక రాష్ట్రాల్లో నివసిస్తున్న సంథాల్ ఆదివాసీ సమాజానికి చెందిన ప్రజలు 'సంథాలీ'ని మాట్లాడతారు. భారతదేశంతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లలో కూడా సంథాలీ మాట్లాడే ఆదివాసీ సమాజాలు ఉన్నాయి. ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో నివసిస్తున్న రామ్‌జిత్ టుడు గారు సంథాలీ భాష ఆన్‌లైన్ గుర్తింపు పొందేందుకు ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. రామ్‌జిత్ గారు డిజిటల్ వేదికను సృష్టించారు. ఇక్కడ సంథాలీ భాషకు సంబంధించిన సాహిత్యాన్ని సంథాలీ భాషలో చదవవచ్చు. రాయవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం రామ్‌జిత్ గారు మొబైల్ ఫోన్ ఉపయోగించడం ప్రారంభించినప్పుడు తన మాతృభాషలో సందేశాలు పంపలేనందుకు ఆయన బాధపడ్డారు. ఆ తర్వాత 'సంథాలీ భాష' లిపి 'ఓల్ చికీ'ని టైప్ చేసే అవకాశాలను అన్వేషించడం ప్రారంభించారు. తన సహోద్యోగుల సహాయంతో 'ఓల్ చికీ'లో టైపింగ్ చేసే సాంకేతికతను అభివృద్ధి చేశారు. నేడు ఆయన కృషి వల్ల సంథాలీ భాషలో రాసిన వ్యాసాలు లక్షలాది మందికి చేరుతున్నాయి.

మన దృఢ సంకల్పం తో సామూహిక భాగస్వామ్యం జోడీ కలిస్తే, యావత్ సమాజానికి అద్భుతమైన ఫలితాలు లభిస్తాయి. దీనికి తాజా ఉదాహరణ 'ఏక్ పేడ్ మా కే నామ్'. ఈ ప్రచారం అద్భుతంగా నిలిచింది. ప్రజల భాగస్వామ్యానికి ఇటువంటి ఉదాహరణ నిజంగా చాలా స్ఫూర్తిదాయకం. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభించిన ఈ ప్రచారంలో దేశంలోని నలుమూలల ప్రజలు అద్భుతాలు చేశారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలు లక్ష్యానికి మించి మొక్కలు నాటి సరికొత్త రికార్డు సృష్టించాయి. ఈ ప్రచారం కింద ఉత్తరప్రదేశ్‌లో 26 కోట్లకు పైగా మొక్కలు నాటారు. గుజరాత్ ప్రజలు 15 కోట్లకు పైగా మొక్కలు నాటారు. ఒక్క ఆగస్టు నెలలోనే రాజస్థాన్‌లో 6 కోట్లకు పైగా మొక్కలను నాటారు. దేశంలోని వేలాది పాఠశాలలు కూడా ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నాయి. చెట్ల పెంపకానికి సంబంధించిన అనేక ఉదాహరణలు మన దేశంలో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అలాంటి ఒక ఉదాహరణ తెలంగాణకు చెందిన కె.ఎన్. రాజశేఖర్ గారిది. మొక్కలు నాటడం పట్ల ఆయనకున్న నిబద్ధత మనందరినీ ఆశ్చర్యపరుస్తుంది. నాలుగేళ్ల క్రితం మొక్కలు నాటే కార్యక్రమాన్నిఆయన ప్రారంభించారు. రోజూ ఓ మొక్క తప్పకుండా నాటాలని నిర్ణయించుకున్నారు.

## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ రాజీనామా చేయాలి : కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. బాండ్ల పేరుతో స్కామ్ జరిగిందన్న ఆరోపణలపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై కేసు నమోదైంది. ఈ క్రమంలో అధికార పార్టీపై కాంగ్రెస్ మరోసారి విరుచుకుపడింది. ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసినందుకు ఆర్థిక మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ ద్వారా మొత్తం ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌పై విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా డబ్బు వసూలు చేసేందుకు నాలుగు పద్ధతులను బీజేపీ ఉపయోగిస్తోందని కాంగ్రెస్ నేతలు అభిషేక్ సింఘ్వీ ఆరోపించారు. గతేడాది కాలంలో మీడియా ఎలక్టోరల్ బాండ్లపై అనేక కథనాలు, పేర్లను ప్రచురించాయని తెలిపారు. చాలా కేసుల్లో మొదటి దర్యాప్తు సంస్థలు కంపెనీలపై దాడులు చేశాయని.. ఆ తర్వాత ఆయా కంపెనీలు చాలా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేశాయన్నారు.

బాండ్ల కొనుగోలు తర్వాత కేసుల దర్యాప్తు వేగం మందగించినట్లు కనిపించిందని ఆరోపించారు. రూ.100కోట్ల మూలధనం లేని కంపెనీలు రూ.500కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయడం చూశామన్నారు. ఎలక్టోరల్ బాండ్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే నాలుగో అంశం సింఘ్వీ అన్నారు. ఏదైనా కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే నిబంధన ఉందని.. కేసు ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఇదిలా ఉండగా.. శనివారం బెంగళూరు కోర్టు ఆదేశాల మేరకు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురిపై కేసు నమోదైంది. ఈడీ అధికారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి బీజేపీ నేతల పేర్లు సైతం ఉన్నారు. ఈ 384, 120బీ, 34 కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర, ఆ పార్టీ నేత నళిన్ కుమార్ కటీల్ పేర్లు ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ముసుగులో దోపిడీకి పాల్పడ్డారని, రూ.8వేలకోట్లకుపైగా వసూలు చేశారని జనాధికార సంఘర్ష్ పరిషత్ కో చైర్మన్ ఆదర్శ్ ఆర్ అయ్యర్ ఫిర్యాదు చేశారు. ఈడీ అధికారుల మద్దతుతోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రయోజనాల కోసం వేలకోట్లు దోపిడీ చేసినట్లు ఆయన ఆరోపించారు.

# భిదేవాడలో క్రాంతిజ్యోతి సావిత్రిబాయి ఫూలే తొలి బాలికల పాఠశాల స్మారకానికి శంకుస్థాపన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : మహారాష్ట్రలో రూ.11,200 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో అనుసంధానం ద్వారా శంకుస్థాపన చేసి, ప్రారంభించి, జాతికి అంకితం చేశారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాని.. రెండు రోజుల కిందట ప్రతికూల వాతావరణం కారణంగా పూణేలో తన కార్యక్రమాలను రద్దు చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ నాటి వీడియో అనుసంధాన కార్యక్రమం ద్వారా మహనీయుల స్ఫూర్తి భూమి అయిన మహారాష్ట్ర అభివృద్ధిలో కొత్త అధ్యాయం ఈ సాంకేతిక కార్యక్రమం వల్ల సుసాధ్యం అయిందన్నారు. పూణేలో జిల్లాకోర్టు నుంచి స్వర్గేట్ వరకు మెట్రో మార్గ ప్రారంభోత్సవాన్నీ, పూణే మెట్రో ఫేజ్–1ను ఈరోజు స్వర్గేట్ నుంచి కత్రాజ్ వరకు పొడిగించే పనుల శంకుస్థాపననూ మోదీ ప్రస్తావించారు. భిదేవాడలో క్రాంతిజ్యోతి సావిత్రిబాయి ఫూలే మొదటి బాలికల పాఠశాల కోసం స్మారక కేంద్రానికి శంకుస్థాపన గురించి మాట్లాడిన మోదీ పూణేలో జీవన సౌలభ్యాన్ని పెంపొందించే పనుల వేగవంతమైన పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

షోలాపూర్ విమానాశ్రయ ప్రారంభం ద్వారా నగరానికి నేరుగా విమాన అనుసంధానంతో భగవాన్ విఠల్ భక్తులు ప్రత్యేక కానుక పొందారని మోదీ పేర్కొన్నారు. టెర్మినల్ కెపాసిటీ పెంపు, ప్రస్తుత విమానాశ్రయ విస్తరణ పనులు పూర్తయితే కొత్త సర్వీసులు, సదుపాయాలతో భగవాన్ విఠల్ భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ విమానాశ్రయం వల్ల వ్యాపారాలు, పరిశ్రమలతో పాటు పర్యాటక రంగానికీ ప్రోత్సాహం లభిస్తుందన్న ప్రధాని, నేటి అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం సందర్భంగా మహారాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలిపారు.

"నేడు, మహారాష్ట్రకు సరికొత్త తీర్మానాలతో అతిపెద్ద లక్ష్యాలు అవసరం" అని పేర్కొన్న ప్రధాన మంత్రి... పూణే వంటి నగరాలను ప్రగతికి, పట్టణాభివృద్ధికి కేంద్రంగా మార్చాల్సిన అవసరాన్ని ప్రధాన మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. పూణే పురోగతిని, పెరుగుతున్న జనాభా ఒత్తిడిని గురించి మాట్లాడిన ప్రధానమంత్రి, అభివృద్ధినీ, సామర్థ్యాన్నీ పెంపొందించడానికి వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ లక్ష్యాల సాధన కోసం, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పూణే నగర ప్రజారవాణాను ఆధునీకరించేందుకు కృషి చేస్తోందన్న ప్రధానమంత్రి విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా కనెక్టివిటీకి ఊతమిస్తోందని తెలిపారు.

పూణే మెట్రో గురించి 2008లోనే చర్చలు ప్రారంభమైనా, పనులు ప్రారంభం కాలేదనీ అయితే తమ ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడంతో 2016లో దానికి పునాదిరాయి పడిందని ప్రధాని గుర్తు చేశారు. ఫలితంగా ఈ రోజు పూణే మెట్రో పనులు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రధాని అన్నారు. నేటి ప్రాజెక్టుల గురించి శ్రీ మోదీ మాట్లాడుతూ, ఒకవైపు జిల్లా కోర్ట్ నుంచి స్వర్గేట్ వరకు పూణే మెట్రో మార్గాన్ని ప్రారంభించడంతో పాటు, మరోవైపు స్వర్గేట్ నుంచి కత్రాజ్ మార్గానికి శంకుస్థాపన కూడా జరిగిందని తెలిపారు. ఈ ఏడాది మార్చిలోనే రూబీ హాల్ క్లినిక్ నుంచి రాంవాడి వరకు మెట్రో సేవలు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. 2016 నుంచి ఇప్పటి వరకు పూణే మెట్రో విస్తరణ కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, అడ్డంకులను తొలగించేందుకు జరిగిన కృషిని ప్రధాన మంత్రి ప్రశంసించారు. గత ప్రభుత్వం 8 ఏళ్లలో ఒక్క మెట్రో పిల్లర్‌నూ నిర్మించలేకపోయిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం పూణేలో ఆధునిక మెట్రో నెట్‌వర్క్‌ను సిద్ధం చేసిందని ఆయన పేర్కొన్నారు.

మహారాష్ట్ర పురోగతి కొనసాగింపులో అభివృద్ధి–ఆధారిత పాలన ప్రాముఖ్యతను శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఏదైనా అంతరాయం కలిగితే అది రాష్ట్రానికి గణనీయమైన నష్టాలకు దారితీస్తుందన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం రాకముందు మెట్రో కార్యక్రమాల నుంచి ముంబయి–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు వరకు– ఆగిపోయిన వివిధ ప్రాజెక్టులను, రైతుల కోసం ఆలస్యమైన కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టులను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

నాటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హయాంలో రూపొందించిన ఆరిక్ సిటీలోని కీలకమైన బిడ్కిన్ పారిశ్రామికవాడ గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఢిల్లీ–ముంబై పారిశ్రామిక కారిడార్‌లోని ఈ ప్రాజెక్ట్ ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నప్పటికీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వ కృషితో సుసాధ్యం అయిందన్నారు. బిడ్కిన్ పారిశ్రామికవాడ ప్రాంతాన్ని దేశానికి అంకితం చేస్తున్నట్లు శ్రీ మోదీ ప్రకటించారు. ఈ ప్రాంతానికి గణనీయమైన పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంలో దాని సామర్థ్యాన్ని వివరించారు. "8,000 ఎకరాల్లో బిడ్కిన్ పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో, వేల కోట్ల పెట్టుబడులు మహారాష్ట్రకు రావడంతో పాటు వేలాది యువతకు ఉద్యోగాలు లభిస్తాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. పెట్టుబడుల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించాలనే వ్యూహం నేడు మహారాష్ట్ర యువతకు ప్రధాన శక్తిగా మారుతున్నదని ఉద్ఘాటించారు. దేశ ప్రధాన విలువల ఆధారంగానే ఆధునీకరణ జరగాలన్నారు. భారత్ తన గొప్ప వారసత్వాన్ని కొనసాగిస్తూనే ఆధునీకరణను, అభివృద్ధినీ సాధిస్తున్నదని తెలిపారు. భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రతి వర్గానికి చేరే అభివృద్ధి ప్రయోజనాలు రెండూ మహారాష్ట్రకు సమాన ప్రాధాన్యాలన్నారు. దేశంలోని ప్రతి వర్గం అభివృద్ధిలో పాలుపంచుకున్నప్పుడు అది వాస్తవరూపం దాల్చుతుందని శ్రీ మోదీ తెలిపారు.

సామాజిక పరివర్తనలో మహిళా నాయకత్వ కీలక పాత్రను ప్రధాన మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. మహిళా సాధికారతలో మహారాష్ట్ర వారసత్వానికి, ముఖ్యంగా మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించడం ద్వారా మహిళా విద్య కోసం ఉద్యమాన్ని ప్రారంభించిన సావిత్రిబాయి ఫూలే కృషికి ఆయన నివాళులర్పించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రం, గ్రంథాలయంతో పాటు ఇతర అవసరమైన సదుపాయాలు గల సావిత్రీబాయి ఫూలే స్మారక కేంద్రానికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ స్మారక కేంద్రం సంఘ సంస్కరణ ఉద్యమానికి శాశ్వత నివాళిగా నిలుస్తూ, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని శ్రీ మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్యానికి పూర్వం భారత మహిళలు ఎదుర్కొన్న అనేక సవాళ్లను, ప్రత్యేకించి చదువు కోసం వారు పడిన ఇబ్బందులను ప్రధాన మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. సావిత్రిబాయి ఫూలే వంటి దార్శనికులు మహిళా విద్యకు మార్గాన్ని సుగమం చేశారని ప్రశంసించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, దేశం నాటి ఆలోచనలను పూర్తిగా విడనాడలేకపోయిందనీ, అనేక రంగాల్లో మహిళల ప్రవేశాన్ని పరిమితం చేసిన గత ప్రభుత్వాలే దీనికి కారణమని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక బాలికలు చదువు మానేసే పరిస్థితులు నాడు ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సైనిక్ పాఠశాలల్లో, సాయుధ దళాల్లో మహిళలకు ప్రవేశం కల్పించడం అలాగే కాలం చెల్లిన వ్యవస్థలను సమూలంగా మార్చడంతో పాటు గర్భిణీ స్త్రీలు సైతం తమ పనిని కొనసాగించేలా చేసిందని శ్రీ మోదీ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన ఇబ్బందుల నుంచి విముక్తి పొందిన మన ఆడబిడ్డలు అతిపెద్ద లబ్ధిదారులుగా ఉన్న స్వచ్ఛ భారత్ అభియాన్ పథకం గణనీయమైన ప్రభావాన్ని ప్రధాన మంత్రి వివరించారు. పాఠశాల పారిశుధ్యం మెరుగుదలతో బాలికలు బడిమానేయడం తగ్గిందని ఆయన పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం కఠినమైన చట్టాల అమలును, భారత ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల నాయకత్వాన్ని మెరుగుపరిచే నారీ శక్తి వందన్ అధినీయమ్‌ను గురించి శ్రీ మోదీ ప్రస్తావించారు. సావిత్రిబాయి ఫూలే స్మారక కేంద్రం ఈ తీర్మానాలకు, మహిళా సాధికారత ప్రచారానికి మరింత శక్తిని ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, "మన ఆడబిడ్డల కోసం ప్రతి రంగం తలుపులు తెరచినప్పుడు మాత్రమే దేశ ప్రగతికి తలుపులు తెరుచుకుంటాయి" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రసంగాన్ని ముగిస్తూ, దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించడంలో మహారాష్ట్ర కీలక పాత్రపై తన నమ్మకాన్ని పునరుద్ఘాటించిన ప్రధానమంత్రి, "మనమంతా కలిసి 'వికసిత్ మహారాష్ట్ర, వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు.

మహారాష్ట్ర గవర్నర్ శ్రీ సి పి రాధాకృష్ణన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏక్‌నాథ్ షిండే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, శ్రీ అజిత్ పవార్ సహా ఇతర ప్రముఖులు ప్రత్యక్షంగా హాజరయ్యారు.

పూణే మెట్రో రైల్ ప్రాజెక్ట్ (ఫేజ్–1) పూర్తి చేసే జిల్లా కోర్ట్ నుంచి స్వర్గేట్ వరకు గల పూణే మెట్రో మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. జిల్లా కోర్టు నుంచి స్వర్గేట్ మధ్య ఈ భూగర్భ రైలు మార్గం కోసం దాదాపు రూ.1,810 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అలాగే, దాదాపు రూ. 2,955 కోట్లతో అభివృద్ధి చేయనున్న పూణే మెట్రో ఫేజ్–1లోని స్వర్గేట్–కత్రాజ్ విస్తరణకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దాదాపు 5.46 కి.మీ. ఈ దక్షిణ ప్రాంత విస్తరణలో మార్కెట్ యార్డ్, పద్మావతి, కత్రాజ్ అనే మూడు స్టేషన్లు పూర్తిగా భూగర్భ మార్గంలో ఉంటాయి.

భారత ప్రభుత్వ జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద 7,855 ఎకరాల విస్తీర్ణంలో విస్తారమైన పరివర్తన ప్రాజెక్ట్ అయిన బిడ్కిన్ పారిశ్రామిక ప్రాంతాన్ని ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌కు దక్షిణాన 20 కిలోమీటర్ల దూరంలో ఇది ఉంది. ఢిల్లీ – ముంబై పారిశ్రామిక కారిడార్ కింద అభివృద్ధి చేసే ఈ ప్రాజెక్ట్ మరాఠ్వాడా ప్రాంతంలో శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. 3 దశల్లో అభివృద్ధి చేసేందుకు రూ.6,400 కోట్లకు పైగా ప్రాజెక్టు వ్యయంతో ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.

పర్యాటకులు, వ్యాపారులు, యాత్రికులు అలాగే పెట్టుబడిదారులకు షోలాపూర్ మరింత అందుబాటులో ఉండేలా, కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరిచే షోలాపూర్ విమానాశ్రయాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. షోలాపూర్‌లోని ప్రస్తుత టెర్మినల్ భవనం సంవత్సరానికి 4.1 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా అభివృద్ధి చేశారు. అలాగే, భిదేవాడలో క్రాంతిజ్యోతి సావిత్రిబాయి ఫూలే మొదటి బాలికల పాఠశాల స్మారక కేంద్రానికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు.

# 'క్రియేట్ ఇన్ ఇండియా' పోటీల ద్వారా మీ సృజనాత్మకతను వెలికితీయండి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన 114వ మన్ కీ బాత్ ప్రసంగంలో భాగంగా వేగంగా మార్పు చెందుతున్న ఉద్యోగాల తీరు, గేమింగ్, ఫిల్మ్ మేకింగ్ వంటి సృజనాత్మక రంగాల్లో పెరుగుతున్న అవకాశాల గురించి మాట్లాడారు. దేశంలో సృజనాత్మక ప్రతిభకు ఉన్న అపారమైన సామర్థ్యాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'క్రియేట్ ఇన్ ఇండియా' ఇతివృత్తంతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న 25 పోటీల్లో పాల్గొనాలని ఆయన క్రియేటర్లకు పిలుపునిచ్చారు.

జాబ్ మార్కెట్ రూపాన్ని మార్చనున్న సరికొత్త సృజనాత్మక రంగాలు

కొత్తగా ఉద్భవిస్తున్న రంగాలు జాబ్ మార్కెట్ రూపాన్ని మార్చేస్తున్నాయని ప్రధానమంత్రి తన ప్రసంగంలో ప్రధానంగా పేర్కొన్నారు. "మార్పు చెందుతున్న ప్రస్తుత కాలంలో ఉద్యోగాల స్వభావమూ మారుతోంది. గేమింగ్, యానిమా, రీల్ మేకింగ్, ఫిల్మ్ మేకింగ్, పోస్టర్ మేకింగ్ వంటి కొత్త రంగాలు పుట్టుకొస్తున్నాయి. ఈ నైపుణ్యాల్లో మీరు బాగా రాణించగలిగితే మీ ప్రతిభకు చాలా పెద్ద వేదిక లభిస్తుంది." అని ఆయన అన్నారు. బ్యాండ్లు, కమ్యూనిటీ రేడియో ఔత్సాహికులు, సృజనాత్మక నిపుణులకు అవకాశాలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి, మరింత ప్రోత్సహించడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 25 పోటీలను ప్రారంభించింది. పైరసీ వ్యతిరేకత, విద్య, సంగీతం వంటి విభిన్న రంగాల్లో ప్రతిభను, సృజనాత్మకతను ప్రోత్సహించడం ఈ పోటీల లక్ష్యం. ఈ పోటీల్లో పాల్గొనడానికి లిజీలవబతినిటతిజీ.నీతీణ వెబ్‌సైట్‌ను సందర్శించాలని క్రియేటర్లకు ఆయన పిలుపునిచ్చారు. "దేశంలోని క్రియేటర్లు తప్పకుండా ఇందులో పాల్గొనాలి. వారి సృజనాత్మకతను బయటకు తీసుకురావాలని నేను ప్రత్యేకంగా కోరుతున్నా" అని ఆయన పేర్కొన్నారు.

క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ – మొదటి సీజన్

క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ – మొదటి సీజన్‌ను న్యూఢిల్లీలో గత నెల 22న కేంద్ర సమాచార, ప్రసార, రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఆవిష్కరించారు. ఈ పోటీలు త్వరలో జరగనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్(వేవ్స్)కు సన్నాహకంగా పని చేస్తాయి. 78వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్న "భారత్‌లో తయారీ, ప్రపంచం కోసం తయారీ" అనే సంకల్పానికి అనుగుణంగా ఇవి జరుగుతాయి.

# ఉత్సవ ప్రియుడిగా శ్రీవారుశ్రీదేవి, భూదేవి సమేతంగా సంబురాలు



తిరుపతి, సెప్టెంబర్ 29 : ప్రపంచ ప్రసిద్ధ ఆలయాల్లో తిరుమల ఆలయం ఒకటి. కేవలం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచే కాక వివిధ దేశాల నుంచి భక్తులు శ్రీవారి దర్శనార్థం తరలి వస్తుంటారు. ఏడాది పొడవునా ఆలయం గోవిందనామ స్మరణతో మార్మోగుతుంది. తిరుమల వేంకటేశ్వర స్వామికి 365 రోజుల్లో 450 పైనే ఉత్సవాలు జరుగుతుంటాయి. తిరుమలలో అన్నీ అద్భుతాలే.. "స్మరణాత్సర్వపాపఘ్నం స్తవనాదిష్టవర్షిణమ్ దర్శనాన్ముక్తిదం శ్రీనివాసం భజే నిశమ్" అని శ్రీవారిని తలంచిన భక్తులకు అన్ని పాపాలు తొలగిపోతాయని నమ్మకం. అదే విధంగా కోరికలు నెరవేరుతాయని, ముక్తి సంప్రాప్తిస్తుంది అన్నది స్వామి వారి భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఏడాది పొడవునా వేంకటేశ్వర స్వామికి ఉత్సవాలను జరుపుతోంది.

భక్తజన ప్రియుడు, ఆశ్రితకల్ప తరువు, కోరిన వరాలిచ్చే కోనేటిరాయుడైన వేంకటేశుడు వెలసివున్న తిరుమల దివ్యక్షేత్రంలో అన్నీ అద్భుతాలే జరుగుతాయి. ఉత్సవాల దేవుడిగా శ్రీవారు నిత్య కల్యాణం పచ్చతోరణంగా ప్రసిద్ధి గాంచిన వేంకటాచలంలో ప్రతిరోజూ ఉత్సవమే. సుప్రభాతం, తోమాల, సహస్రనామార్చన వంటి నిత్యోత్సవాలు, అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, పూలంగి, శుక్రవారాభిషేకం వంటి వారోత్సవాలు, రోహిణి, ఆరుద్ర, పునర్వసు, శ్రవణం వంటి నక్షత్రోత్సవాలు, కోయిలాళ్వార్ తిరుమంజనం, ఉగాది ఆస్థానం, తెప్పోత్సవం, పద్మావతి పరిణయం, జేష్ఠాభిషేకం, ఆణివార ఆస్థానం, పవిత్రోత్సవం, బ్రహ్మోత్సవం వంటి సంవత్సరోత్సవాలతో ప్రతి రోజూ ఒక పండుగగా, ప్రతి పూటా పరమాన్న భరిత నివేదనలతో, ఏడు కొండల వాడు సంవత్సరం పొడవునా పూజలు అదుకుంటూ ఉత్సవాల దేవునిగా ఆరాధింపబడుతున్నారు.

తిరుమాడ వీధులలో ఊరేగింపు..ఏడాదికి ఉన్నవి 365 రోజులే కాని, కొండలరాయునికి జరిగే ఉత్సవాలు 450కి పైమాటే.. అలంకార ప్రియుడైన శ్రీహరి వైభవాన్ని తిలకింప వేయికన్నులైనా చాలవు. స్వామి వారి ఉత్సవ మూర్తి అయిన మలయప్ప తన ఉభయదేవేరులైన శ్రీదేవి, భూదేవీతో కూడి సర్వాంగ సుందరంగా అలంకృతుడై తిరు ఉత్సవాల్లో పాల్గొంటూ.. తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.